మెగా డీఎస్సీ పరీక్షలు ప్రారంభం

- మొదటి రోజు 179 మంది అభ్యర్థులు గైర్హాజర్




జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



హాల్‌టికెట్ నంబర్‌ను చూసుకుంటున్న అభ్యర్థులు

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా మెగా డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్ష శుక్రవారం ముగిసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో డీఎస్సీ పరీక్షకు మొత్తం 55,177 మంది అభ్యర్థులు నమోదు చేసుకున్నారు. ఈ అభ్యర్థుల కోసం మొత్తం 17 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. హైదరాబాదులో 9, కర్నూలులో 8 ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదటి రోజు 1,518 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉంది. 1,339 మంది పరీక్షకు హాజరు కావడంతో జిల్లాలో 88.21 శాతం హాజరు నమోదైంది. ఉదయం సెషన్స్ పరీక్షకు 762 మంది అభ్యర్థులకు గాను 673 మంది పరీక్షకు హాజరు కాగా, 89 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం జరిగిన సెషన్స్ పరీక్షకు 756 మం దికి గాను 666 మంది హాజరయ్యారు. ఈ పరీక్ష ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్స్‌లో కొనసాగింది. కర్నూలు నగరంలోని జి. పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలోని ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ రంజిత్ బాషా పరిశీలించారు. జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) శామ్యూల్ పాల్ కలెక్టర్ వెంట ఉన్నారు.

ఆశల ఖరీఫ్..!



ఈ ఏడాది నైరుతి రుతిపవనాలు ముందుగానే రావడంతో విస్తారంగా వర్షాలు కురిశాయి. అన్నదాతలు ఎంతో ఆశతో ఖరీఫ్ సాగుకు సిద్ధమయ్యారు. దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేస్తున్నారు. వ్యవసాయ యంత్రాంగం మేము సైతం అంటున్నారు. ఈఏడాది 4,22,540 హెక్టార్లు వివిధ పంటలు సాగు చేసే అవకాశముందని అంచనా వేస్తున్నారు. అందులో అత్యధికంగా 2.34లక్షల హెక్టార్లలో పత్తి సాగు చేయవచ్చని వ్యవసాయ శాఖ అంచనా. నాసిరకం విత్తనాలు, పెట్టుబడి సమస్య, ఎరువులు, పెరిగిన సేద్యం ఖర్చులు రైతులను వెంటాడుతున్నాయి. బ్యాంకుల్లో సర్దుబాటు (బుక్ అడ్జస్ట్‌మెంట్) రుణాలతో సరిపుచ్చుతున్నారు. దీంతో పెట్టుబడి కోసం అధిక వడ్డీలకు అప్పు చేయక తప్పని పరిస్థితి. 2025-26 ఖరీఫ్ సాగుబడిపై 'ఆంధ్రజ్యోతి'ప్రత్యేక కథనం.

- మురిపించిన ముందస్తు రుతుపవనాలు
- సాగుకు సన్నద్ధమవుతున్న అన్నదాతలు
- మృగశిర కార్తెలో విత్తనాలు వేసేలా ప్రణాళిక
- 4,22,540 హెక్టార్ల సాగు లక్ష్యం
- వేధిస్తున్న నాసిరకం విత్తనాలు
- పెట్టుబడి కోసం తప్పని తిప్పలు
- అన్నదాత సుఖీభవ కోసం ఎదురుచూపులు
- కౌలు రైతులకు రుణాలు అందేనా?
- పత్తి 2.34లక్షల హెక్టార్లలో సాగు చేయవచ్చని అంచనా

కర్నూలు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రైతుల ఎంతో ఆశతో ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. కర్నూలు జిల్లాలో ప్రధాన జీవనాధారం వ్యవసాయం. 2025-26 ఖరీఫ్ సీజన్ సాధారణ సాగు విస్తీర్ణం 4,22,540 హెక్టార్లు. గతేడాది పత్తికి ఆశాజనకంగా ధర ఉండడం, ఈ ఏడాది తెల్లబంగారం కనీస మద్దతు ధర రూ.8,110కు పెంచడంతో రైతులు 2.34 లక్షల హెక్టార్లతో సాగు చేయవచ్చని అంచనా వేస్తున్నారు. చిరుధాన్యం పంటలు 2,679 హెక్టార్లు, ఆహార పంటలు 58,466 పప్పుదినుసులు 58,515, ఆయిల్ సీడ్స్ 64,633 హెక్టార్లు సాగు లక్ష్యంగా పెట్టుకున్నారు. పత్తి తరువాత కంది, వేరుశనగ, ఉల్లి, మిరప, ఆముదం పంటలు అధికంగా సాగు చేసే అవకాశం ఉంది. ముందస్తు వర్షాలు మురిపించడంతో అన్నదాతలు పొలాలు దుక్కులు దున్ని మృగశిర కార్తెలో వర్షాధారం పంట విత్తనాలు వేసేందుకు సన్నద్ధం చేస్తున్నారు.





ఎరువు.. బరువు: యూరియా 83,948 టన్నులు, కాంప్లెక్స్ 1,35,766 టన్నులు, డీఏపీ 26,847 టన్నులు, ఎస్ఎస్‌పీ 3,174, ఎంఓపీ (పొటాస్) 9,438, సిటీ కంపోస్టు 6,479 టన్నులు కలిపి 2,65,652 మెట్రిక్ టన్నులు రసాయన ఎరువులు అవసరమని అంచనా. ప్రస్తుతం అందుబాటులో ఉన్నది 65 వేల మెట్రిక్ టన్నులే. కాంప్లెక్స్ ఎరువు బస్తాపై రూ.50-100 పెరగడంతో రైతులకు భారం తప్పడం లేదు.

వెంటాడుతున్న నాసిరకం విత్తనాలు

బీటీ-2 పత్తి విత్తనాలు 475 గ్రాములు (450 గ్రామలు బీటీ రకం, 25 గ్రాములు నాన్ బీటీ రకం) ప్యాకెట్ కనీస విక్రయ ధర (ఎంఆ ర్‌పీ) రూ.863 నుంచి రూ.901లకు పెంచారు. ఒక్కో ప్యా కెట్‌పైన రూ.38 పెరగడంతో ఉమ్మడి జిల్లా రైతుల పై రూ.11.50 కోట్ల వరకు అదనపు భారం తప్పడం లేదు. మరో పక్క నాసిరకం విత్తనాలు సమస్య వెంటాడుతుంది. అధికారుల తనిఖీలు నామ మాత్రంగానే ఉంది.

మిగతా 7వ పేజీలో

అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తా

- సీఎం నమ్మకాన్ని నిలబెట్టుకుంటా
- డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి

7



విష్ణువర్ధన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న బ్యాంకు సీఈవో రామాంజనేయులు

త్యాగానికి ప్రతీక బక్రీద్

- ముస్తాబైన మసీదులు, ఈద్గాలు
- పవిత్ర ఖుర్బానీ, ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు
- జోరుగా పొట్టేళ్లు, గొర్రెల అమ్మకాలు

కర్నూలు కల్చరల్/ ఆలూరు జూన్ 6(ఆంధ్రజ్యోతి): త్యాగానికి ప్రతీకగా భావించే బక్రీద్ పండగకు ముస్లింలు శుక్రవారం ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం జూన్ మాసంలో చంద్రోదయం ఆధారంగా 10వ రోజున శనివారం ఈద్ ఉల్ జహా (బక్రీద్) జరుపుతారు. అల్లా కోసం పూర్వప్రవక్త హజరత్ ఇబ్రహీం తన కుమారుడు ఇస్మాయిల్ ప్రాణాన్ని త్యాగం చేసేందుకు సిద్ధపడి దైవ పరీక్షలో నెగ్గిన సందర్భాన్ని పురస్కరించుకుని ముస్లింలు బక్రీద్ త్యాగదినంగా నిర్వహిస్తారు. ఈసందర్భంగా ముస్లింలు మసీదులకు వెళ్లి ప్రత్యేక నమాజ్ చేసి బంధుమిత్రులను కలిసి శుభాకాంక్షలు చెబుతారు. రంజాన్ సందర్భంగా దానాలు చేసే ముస్లింలు బక్రీద్ రోజున ఖుర్బానీ ఇస్తారు.



ఇదీ చరిత్ర: ప్రవక్త హజరత్ ఇబ్రహీం నిద్రిస్తున్న సమయంలో తన కుమారుడిని త్యాగం చేస్తున్నట్టు కల వస్తుంది. ఇలా మూడుసార్లు కల రావడంతో ఇదే విషయాన్ని తన కుమారుడు ఇస్మాయిల్‌కు చెబుతారు. దైవ విశ్వాస్ అయిన హజరత్ ఇస్మాయిల్ నిస్సంకోచంగా అందుకు అంగీకరించి, ప్రాణత్యాగానికి సిద్ధమవుతారు. దైవానుగ్రహం కోసం కుమారుడిని సైతం ప్రాణత్యాగం చేయడానికి సిద్ధపడిన ప్రవక్త హజరత్ ఇబ్రహీం త్యాగ నిరతిని, దైవంపై ఉన్న అచంచల విశ్వాసానికి అల్లా ప్రసన్నమవుతారు. కుమారుడిని ఖుర్బానీ ఇచ్చే సమయంలో స్వర్గం నుంచి ఓ గొర్రె(దుంబ)ను తెచ్చి ఆ ప్రదేశంలో ఉంచుతారు. దీంతో అల్లా ఆదేశం ప్రకారం ఖుర్బానీ సంపూర్ణమవుతుంది. ఈ చారిత్రక ఘటన నేపథ్యంలో మహా ప్రవక్త నిర్దేశం మేరకు బక్రీద్ పండగను జరుపుకోవడం ముస్లింలకు ఆచారంగా వస్తోంది.

ఖుర్బానీ: బక్రీద్ సందర్భంగా ముస్లింలు ఖుర్బానీ ఇవ్వడం అత్యంత పవిత్రంగా భావిస్తారు. ఖుర్బానీ ఇచ్చిన జంతువు మాంసాన్ని మూడు భాగాలు చేస్తారు. ఓ భాగాన్ని పేదలకు, రెండో భాగాన్ని బంధుమిత్రులకు, మూడో భాగాన్ని తమ కోసం ఉంచుకుంటారు. ఇందులో ఏ ఎ ా ల తే ం వ్యత్యాసం రాకూడదు.

సందడి షురూ...: బక్రీద్ సందర్భంగా పొట్టేళ్లు, గొర్రెలు, మేకల విక్రయాలు, కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ఖుర్బానీ కోసం ఇప్పటికే కొందరు పత్తికొండ, గూళ్యం, అరికెర, ఆదోని ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా పొట్టేలు కొనుగోలు చేశారు. రూ.10 వేల నుంచి రూ.30 వరకు ధర పలుకుతోందని వ్యాపారులు చెబుతున్నారు. శనివారం జరిగే ప్రత్యేక ప్రార్థనలకు మసీదులు, ఈద్గాలు సిద్ధం చేశారు.

నమాజ్‌లకు ఈద్గాలు, మసీదులు సిద్ధం

ఈద్ ఉల్ జహా (బక్రీద్) నమాజ్‌లకు ఈద్గాలు, మసీదులు సిద్ధం చేశారు. శుభ్రం చేసి శనివారం నమాజ్‌లు చేసేందుకు ఏర్పాట్లుచేశారు. కర్నూలు పట్టణంలోని సంతోష్‌నగర్‌లోని కొత్త ఈద్గాలో, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న పాత ఈద్గాలో, జోహరాపురం గ్రామంలోని ఈద్గాలో, గడ్డా ఈద్గాలో, పలు మసీదుల్లో సైతం మత పెద్దలు ఈద్ నమాజ్‌లు, దైవ సందేశాలు అందజేస్తారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఈద్గాలు, మసీదుల్లో నమాజుకు ఏర్పాటు చేశారు.

ముస్లింలకు కలెక్టర్ శుభాకాంక్షలు

కర్నూలు కలెక్టరేట్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ముస్లింలకు కలెక్టర్ పి.రంజిత్ బాషా బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ జరుపుకునే వేడుక బక్రీద్ అన్నారు. అందరూ సుఖసంతోషాలతో ఆనందంగా పండుగను జరుపుకోవాలని ఆయన అల్లాహ్‌ను ప్రార్థించారు.

సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్‌గా రాధిక

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా బి.రాధికను నియమిస్తూ సాంఘిక సంక్షేమ శాఖ ప్రభుత్వ కార్యదర్శి ఎంఎం. నాయక్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. అనంతపురం జిల్లా డీఎస్‌డబ్ల్యూవోగా పని చేస్తున్న రాధికను కర్నూలు డిప్యూటీ డైరెక్టర్‌గా నియమిస్తూ బదిలీ చేశారు. ఇక్కడ జాయింట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న రంగలక్ష్మీదేవి అమరావతి హెడ్ ఆఫీసుకు బదిలీ కావడంతో ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పని చేస్తున్న తులసిదేవిని ఇన్‌చార్జి అధికారిగా కలెక్టర్ నియమించారు. రాధిక రాకతో ఈ పోస్టు భర్తీ అయింది.

న్యూస్ బాక్స్

గురుకులాలకు సీటు ఖరారు చేసుకోవాలి

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): డా.బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో ప్రవేశాలకు విద్యార్థులు వెంటనే సీటును ఖరారు చేసుకోవాలని గురుకులాల జిల్లా సమన్వయకర్త శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు జరిగిన పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు పొందిన వారికి ఎంపిక ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు. ఎంపికైన వారు సెల్‌ఫోన్‌కు మెసెజ్ వచ్చిన వెంటనే పాఠశాల, కళాశాలకు వెళ్లి సీటును ఖరారు చేసుకోవాలని కోరారు.

జిల్లా జైలు తనిఖీ



ఖైదీలకు అందించే ఆహారాన్ని రుచి చూస్తున్న న్యాయాధికారి

కర్నూలు లీగల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మండలం పంచలింగాలలోని జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి శుక్రవారం తనిఖీ చేశారు. ఆ తర్వాత ఆయన మహిళా జైలును కూడా తనిఖీ చేసి జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను తనిఖీ చేసి దాని అవశ్యకతను ఖైదీలకు వివరించారు. అనంతరం ఖైదీలకు అందిస్తున్న భోజన వసతి సౌకర్యాల గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శివరామచంద్రరావు, జిల్లా జైలు సూపరింటెండెంట్లు పాల్గొన్నారు. అనంతరం ఆయన కర్నూలు ప్రభుత్వ జువైనల్ హోంను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో జువైనల్ మెజిస్ట్రేట్ అర్చన, సభ్యులు సునీత, మాధవి, సూపరింటెండెంట్ హుసేన్ బాషా, ప్యానెల్ న్యాయవాది లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నేడు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదల



కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు శనివారం విడుదల కానున్నట్లు ఆర్ఐవో సురేష్‌బాబు శుక్రవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈ ఫలితాలు విడుదల చేయనున్నట్లు వివరించారు. మే 12 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు కొనసాగాయి.

కాన్వొకేషన్ కష్టాలు..!

- ఆర్‌యూలో విద్యార్థులకు ఇబ్బందులు
- ఇరవై నెలలుగా మంజూరు కానీ పట్టాలు
- ఉన్నత విద్యకు దూరమవుతున్న విద్యార్థులు
- మారిన ముగ్గురు ఉపకులపతులు

కర్నూలు అర్బన్ జూన్ 6 ఆంధ్రజ్యోతి): ఆర్‌యూలో విద్యార్థులకు పట్టా కావాలంటే ఇన్ అడ్వాన్స్ రూపంలో అదనపు రుసుము చెల్లించాల్సిందే. లేదంటే వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. రాయలసీమ యూనివర్సిటీలో విద్యార్థులకు కాన్వొకేషన్ కష్టాలు తప్పడం లేదు. వర్సిటీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు ఉన్నత చదువులకు, ఉద్యోగాలకు దూరం కావాల్సిన పరిస్థితి నెలకొంది. నాలుగోవ కాన్వొకేషన్‌కు నోటిఫికేషన్ అక్టోబరు 4 2023లో ఇచ్చారు. దాదాపు 20 నెలలు పూర్తయ్యింది. ఈలోపు ముగ్గురు ఉపకులపతులు మారారు. విద్యార్థులకు కాన్వొకేషన్ ఇవ్వలేకపోతున్నారు. ఈకాన్వొకేషన్ నోటిఫికేషన్‌లో 9,696 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. కానీ విద్యార్థులకు డీఎస్సీ, బ్యాంకింగ్, రైల్వే ఉద్యోగాలకు నోటిఫికేషన్‌లో కాన్వొకేషన్ పట్టా తప్పనిసరిగా అవసరం ఉండటంతో వర్సిటీ అధికారులను సంప్రదించగా కాన్వొకేషన్ ఫెలిస్టేషన్ జరపకుండా కాన్వొకేషన్ ఇవ్వడం వీలుకాదని చెబుతున్నారు. మీకు అత్యవసరం ఉంటే ఇన్ అడ్వాన్సు రూపంలో(అదనపు రుసుం) చెల్లించి తీసుకువెళ్లాలని చెప్పటంతో ఒక్కసారిగా విద్యార్థులు ఖంగుతున్నారు. చేసేది ఏమి లేక కాన్వొకేషన్ అవసరం ఉండటంతో నాల్గవ కాన్వొకేషన్‌కు చెల్లించిన డబ్బు కాకుండా అదనంగా ఇన్ అడ్వాన్సు చెల్లించి పట్టాలు తీసుకుంటున్నారు.

విద్యార్థి సంఘాల మండిపాటు

విద్యార్థులకు కాన్వొకేషన్ ఇవ్వలేని వర్సిటీ అధికారులు పాలన ఎలా చేస్తారని విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు. యూనివర్సిటీలో రోజు గొడవలు, దాడులు, అవినీతి, అక్రమాలతో కొట్టుమిట్టాడుతుండగా గాడిన పెడతారని ఎదురుచూసినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని వాపోతున్నారు. కనీసం కాన్వొకేషన్ మంజూరులో కూడా వైఫల్యం చెందడంతో ఎందరో విద్యార్థులు వర్సిటీ చుట్టూ ప్రదక్షిణ చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇన్‌అడ్వాన్స్ రూపంలో కాన్వొకేషన్‌ను తీసుకోవడంపై విద్యార్థులపై అదనపు భారం వల్ల కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని, ఇదే విషయాన్ని మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్తామని అంటున్నారు. ప్రస్తుతం కాన్వొకేషన్ కావాలి అంటే ఇన్ అడ్వాన్సు పేరుతో యూజీకి రూ.900, పీజీ రూ.500, పీహెచ్‌డీకి రూ. 500 అదనపు భారం పడుతోందని విద్యార్థి నాయకులు మండి పడుతున్నారు.

నాలుగో కాన్వొకేషన్ ఫీజు వివరాలు..

యూజీ	1100
పీజీ	1500
పీహెచ్‌డీ	2500

ఇన్ అడ్వాన్సు రూపంలో కాన్వొకేషన్ ఫీజు

యూజీ	2000
పీజీ	2000
పీహెచ్‌డీ	3000



కాంట్రాక్ట్ జాబ్ వచ్చింది



తెలంగాణలోని గురుకులంలో పీజీటీ(గణితం) కాంట్రాక్టు జాబ్ వచ్చింది. బీఎడ్ కాన్వొకేషన్ ఖచ్చితంగా కావాలని రాయలసీమ యూనివర్సిటీ అధికారులను సంప్రదించగా ఇన్ అడ్వాన్సు రూపంలో తీసుకోవాలని అంటున్నారు. ఇప్పటికే నాల్గవ కాన్వకేషన్ కోసం ఆన్‌లైన్‌లో బీఎడ్ కాన్వొకేషన్ కోసం రూ.1100 చెల్లించాను. చేసేదేమీ లేక మరో రూ.900 అదనంగా చెల్లించి బీఎడ్ కాన్వొకేషన్‌ను తీసుకున్నాను.

- కె.రఘు, బీఎడ్ స్టూడెంట్, ఆర్‌యూ

ఇప్పటికే రెండు సార్లు కోరాం

గవర్నర్ ప్రోగ్రామ్ కన్ఫర్మేషన్ లేదు. ఇప్పటికే రెండు సార్లు కోరాం. ప్రస్తుతం ఇబ్బంది లేకుండా విద్యార్థులకు కాన్వొకేషన్ పట్టాలు జారీ చేస్తున్నాం.

- వి. వెంకట బసవరావు, ఉపకులపతి, ఆర్‌యూ

వైద్యశాఖలో బదిలీల షెడ్యూల్ విడుదల

కర్నూలు హాస్పిటల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు వైద్య ఆరోగ్య శాఖలో జిల్లా పరిధిలోని పోస్టులకు బదిలీ షెడ్యూల్‌ను డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ విడుదల చేశారు. ఈ నెల 9వ తేదీ వరకు జిల్లా కేడర్‌కు చెందిన ఉద్యోగులు బదిలీ దరఖాస్తులను స్వీకరిస్తారు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు దరఖాస్తుల వెరిఫికేషన్ ఉంటుంది. ఈ నెల 13వ తేదీన కర్నూలు, నంద్యాల జిల్లాల వెబ్‌సైట్‌లో అర్హత కలిగిన ఉద్యోగుల జాబితాను విడుదల చేస్తారు. 14 నుంచి 15వ తేదీ వరకు ఉద్యోగుల నుంచి అభ్యంతరాలు, ఫిర్యాదులను స్వీకరిస్తారు. అనంతరం సీనియారిటీ జాబితా విడుదల చేసి 18, 19 తేదీల్లో ఉద్యోగులకు బదిలీలు నిర్వహిస్తారు.

మీదివేములలో భగ్గుమన్న ఫ్యాక్షన్

మాజీ ఎంపీటీసీ హత్య నేపథ్యంలో గ్రామంలో పోలీసు బందోబస్తు

7



ఫిట్ అధనం

నేటి సమాజంలో ప్రతి ఒక్క తల్లిదండ్రులు తమ పిల్లలను ఉజ్వల భవిష్యత్తు కోసం అహర్నిశలు తపిస్తున్నారు. దీంతో మంచి పాఠశాలలో చేర్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈనేపథ్యంలో ఎంత దూరమైనా పంపిస్తున్నారు. ఇలాంటి వేళ ప్రతి బడికి బస్సు తప్పని సరైంది. ఈ బస్సులు ఎంతవరకు భద్రమో తెలియదు. అయితే ప్రతి ఏడాది వీటికి ఎఫ్‌సీ(ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు) మాత్రం తప్పక తీసుకోవాల్సిందే. అయితే గతంలో మాదిరి కాకుండా ప్రస్తుతం నూతన విధానంలో ఎఫ్‌సీలు జారీ చేస్తున్నారు. దీనికి ప్రైవేటు ఏజెన్సీలకు బాధ్యతను అప్పగించారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 1400 పైగా స్కూల్స్, కళాశాలల బస్సులు ఉన్నాయి. వీటికి పరీక్షలను నిర్వహించేందుకు, ప్రతి దానికి ఏజెన్సీల వారు అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం. గతంలో మాదిరిగా గడువు దాటినా నిదానంగా ఎఫ్‌సీలు చేయించుకుందామంటే ఇక కుదరదు. ఆలస్యమైతే సీజ్ చేస్తామని రవాణా శాఖాధికారులు చెబుతున్నారు.

- బడి బస్సులకు నూతన విధానంలో ఫిట్‌నెస్ పరీక్షలు
- ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగింత
- అక్కడంతా ఏజెంట్లదే హవా
- ఆటోమేటెడ్ మిషన్ ద్వారా సామర్థ్య పరీక్షల నిర్వహణ
- ప్రతి స్కూల్ నుంచి రూ. 3వేల నుంచి రూ.4వేలు వసూలు
- లబోదిబోమంటున్న స్కూళ్ల యాజమాన్యాలు
- ప్రతి ఒక్కరూ ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాల్సిందే : శాంతకుమారి, డీటీసీ

కర్నూలు క్రైం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బడి బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలకు ఓ సెంటర్‌లో డబ్బులను అదనంగా వసూలు చేస్తున్నారు. ఈఏడాది మాత్రం కొత్త విధానం అమలులోకి వచ్చింది. వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలన్నీ ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎఫ్‌సీ(ఫిట్‌నెస్ సర్టిఫికెట్) చేయించుకోవాలంటే సీటింగ్ కెపాసిటీ బట్టి ప్రతి బస్సు రూ.1500 నుంచి రూ.2వేలు చలానా ప్రభుత్వానికి చెల్లించాలి. ఇతరత్రా మరమ్మతులు, రేడియం స్టిక్కర్లు యాజమాన్యమే భరించాలి. ఉమ్మడి జిల్లాలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కర్నూలుకు చిన్నటేకూరు వద్ద, నంద్యాలకు చాబోలు వద్ద ఏర్పాటు చేశారు. వీటిలో ఓకేంద్రంలో ప్రతి స్కూల్ యాజమాన్యం నుంచి రూ.3వేలు నుంచి రూ.4వేలు దాకా అదనపు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్కడ రవాణా శాఖ అధికారులు కూడా ఎవరూ ఉండకపోవడంతో ఏజెన్సీకి చెందిన కొంతమంది ప్రైవేటు వ్యక్తులు ఈ వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం. మరో వైపు ఏజెంటు ద్వారా వెళితేనే దాదాపు వాహనాలన్నీ ఫిట్‌నెస్ పాస్‌వుతున్నాయని, ఏజెంట్ ద్వారా కాకుండా నేరుగా వెళితే.. ఆటోమేటెడ్ మిషన్ ద్వారా కాకుండా మాన్యువల్ చేసే కొన్ని నిబంధనల్లో ఏదో ఒక కొర్రీ వేసి వెనక్కు పంపుతున్నట్లు ఆరోపణలున్నాయి. బస్సులకు అతికించే రేడియం స్టిక్కర్లు కూడా అదనంగా వసూలు చేస్తున్నట్లు సమాచారం. లోపలికి వచ్చిన తర్వాత రేడియం స్టిక్కర్లు వేయించుకోవాలని, బయట వేసే స్టిక్కర్లు చెల్లవని చెబుతున్నట్లు తెలిసింది. దీంతో రవాణా శాఖ అధికారులకు కూడా వాటా ఇవ్వాల్సి ఉంటుందని ప్రైవేటు వ్యక్తులు ముక్కు పిండి వసూలు చేస్తున్నట్లు పాఠశాల యాజమాన్యాలు వాపోతున్నాయి.

మే మొదటి వారం నుంచి జూన్ ఆఖరి వరకు..

పాఠశాలలు తెరిచే సమయం దగ్గరపడుతోంది. జూన్ 12 నుంచి పాఠశాలల పునఃప్రారంభం కానున్నాయి. స్కూల్ బస్సుల హడావుడి కూడా పెరిగింది. 8 ఏళ్లలోపు సర్వీసులో ఉన్న స్కూల్ బస్సులు రెండేళ్లకోసారి ఫిట్‌నెస్ చేయించుకోవాల్సి ఉండగా ఆ పైబడి సర్వీసు ఉన్న స్కూల్ బస్సులన్నీ ప్రతి ఏడాది ఫిట్‌నెస్ చేయించుకోవాల్సిందే. ప్రతి ఏడాది మే మొదటి వారం నుంచి జూన్ ఆఖరి వరకు ఫిట్‌నెస్ పరీక్షలు జరుగుతాయి. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా వాహనాలు తిరిగితే మాత్రం రవాణా శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారు. రెండు ఉమ్మడి జిల్లాలో 1400 పైగా స్కూల్స్, కళాశాలల బస్సులు ఉన్నాయి. పాఠశాలలను తెరిచేనాటికంతా ఈ స్కూల్స్, కళాశాలల యజమాన్యాలు వాటి బస్సులకు మరమ్మతులు చేయించుకుని ఫిట్‌నెస్ చేయించుకోవాలి.

సుమారు 15 నిబంధనలు తనిఖీ..

మోటారు వాహనాల చట్టం ప్రకారం అన్ని పాఠశాలల బస్సుల్లో 33 నిబంధనలు తప్పనిసరి చేశారు. చిన్నచిన్న లోపాలకు కూడా అవకాశం లేకుండా పారదర్శకంగా పూర్తిస్థాయి సామర్థ్యం తో పాఠశాలల బస్సులు ఉండాలన్నదే ప్రభుత్వ నిర్ణయం. ఈ నేపథ్యంలో గతంలో ఫిట్‌నెస్ పరీక్షలన్నీ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు చేసేవారు. అక్కడ కొంత అవినీతికి తావుండేది. ఈఏడాది నుంచి మాత్రం ఆటోమేటెడ్ మిషన్ల ద్వారా 33 నిబంధనల్లోని సుమారు 15 నిబంధనలు తనిఖీలు చేస్తారు. ముఖ్యంగా బ్రేకుల సామర్థ్యం, టైర్ల సామర్థ్యం, వీల్ అలైన్‌మెంట్, స్టీరింగ్ కండిషన్ తదితర అంశాలన్నీ ఈఆటోమేటెడ్ మిషన్ ద్వారానే నిర్వహిస్తారు. మిగతా కొన్ని ప్రమాణాలు రేడియం స్టిక్కర్లు, ఇతరత్రా కొన్ని మాన్యువల్ విధానంలోనే అమలు చేస్తున్నారు. ప్రైవేటు ఏజెన్సీలు ప్రతి వాహనానికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీచేస్తారు. ఆ తర్వాత ఏ సంఘటన జరిగినా వారిదే బాధ్యత అవుతుందని, ఇక్కడ ఫుల్లీ ఆటోమేటెడ్ మిషన్ ద్వారా తనిఖీ చేయడంతో వెహికల్ ఇన్‌స్పెక్టర్లు కూడా ఎవరూ ఉండరు. అందరూ ప్రైవేటు వ్యక్తులే ఉంటారు.

అదనంగా వసూలు చేస్తే చర్యలు

ఆటోమేటెడ్ మిషన్ల ద్వారా వాహన సామర్థ్యం పరీక్షలు నిర్వహించేందుకు ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించాం. ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకునే వారు ప్రభుత్వ నిబంధనల ప్రకారమే చలానా కట్టాలి. ఎవరైనా అదనంగా చెల్లించాల్సిన అవసరం లేదు. అలా వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి తెస్తే చర్యలు తీసుకుంటాం. ప్రతి పాఠశాల, కళాశాల బస్సు పాఠశాల తెరిచేలోగా ఫిట్‌నెస్ చేయించుకోవాల్సిందే.

- శాంతకుమారి, డీటీసీ, కర్నూలు



గడువు దాటితే సీజ్

గతంలో మాదిరిగా గడువు దాటినా నిదానంగా ఎఫ్‌సీలు చేయించుకుందామంటే ఇక కుదరదు. గతంలో రోజుకు ఎన్ని వాహనాలు వెళ్లినా ఎఫ్‌సీలు చేసేవారు. ప్రస్తుతం ఆటోమేటెడ్ మిషన్ల ద్వారా 30బస్సులను మాత్రమే తనిఖీలు చేస్తున్నారు. అందులో నిబంధనలు పాటించని వాటిని వెనక్కు తిరిగి పంపుతు న్నారు. వీటన్నింటిని కంప్యూటర్‌లో నమోదు చేసి ఆరోజు సాయంత్రానికే సర్టిఫికెట్ జారీచేస్తారు. అయితే జూన్ మొదటి వారంలోగా ఎఫ్‌సీ చేయించు కోవాలి. ఆ తర్వాత వాహనాల తనిఖీల్లో దొరికితే మాత్రం సీజ్ చేస్తారు.



పొలం పత్రాలను ఆలయ అధికారులకు అందజేస్తున్న భక్తుడు

ఉరుకుంద ఈరన్నకు
రూ.7కోట్ల విలువైన స్థలం
కర్ణాటక భక్తుడి విరాళం

కౌతాళం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఈరన్న స్వామి పేరు మీద తన 1.2 ఎకరాల పొలాన్ని కోసిగి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ చేయించిన దస్తావేజుల ఆలయ డిప్యూటీ కమిషనర్‌కు, ఈఓ మేడిపల్లి విజయరాజుకు శుక్రవారం అందజేశారు. శుక్రవారం దేవస్థానపు కార్యాలయంలో ఈవో ఆలయ ప్రధాన, ఉప ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి, మహదేవప్పలతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులను గురించి వివరించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ కర్ణాటకకు చెందిన తిప్పయ్య అనే భక్తుడు రూ. 7కోట్లు విలువ చేసే 1.2ఎకరాల భూమిని దేవాలయానికి విరాళంగా అందించినట్లు తెలిపారు. దాత కోరిక మేరకు ఈ స్థలంలో భక్తులకు రెండు డార్మిటరీ హాళ్లు, భక్తులు తలనీలాలు సమర్పించేందుకు కల్యాణ కట్టను నిర్మిస్తున్నట్లు తెలిపారు. అలాగే మరో భక్తుడు విరాళంగా ఇచ్చిన రూ.2.3 కోట్లతో భక్తులకు మూడు అంతస్థుల అన్నదాన సత్రం నిర్మాణం చేపట్టేందుకు ఉన్నతాధికారులకు నివేదికలను పంపినట్లు తెలిపారు. గోశాల అభివృద్ధికి ఇద్దరు భక్తులు రూ.13లక్షలతో ముందుకు వచ్చారని తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ సిబ్బంది వెంకటేశ్వర్లు, కుమార్ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

ఆరు బైకులు, రూ.52వేలు స్వాధీనం

కోసిగి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద భోంపల్లి గ్రామ పరిధిలో ఓ పొలంలో చెట్టు కింద పేకాట ఆడుతున్న పేకాటరాయుళ్లపై కోసిగి సీఐ మంజునాథ్, ఎస్ఐ హనుమంతరెడ్డి సిబ్బందితో కలిసి దాడులు చేసి 15 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వారి నుంచి 6 మోటారు సైకిళ్లు, 7 సెల్‌ఫోన్లను సీజ్ చేసి రూ.52వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు సీఐ, ఎస్ఐ తెలిపారు. శుక్రవారం కోసిగి సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో సీఐ, ఎస్ఐలు మాట్లాడుతూ తమకు వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం మధ్యాహ్నం పెద్దభోంపల్లి గ్రామ సమీపంలో చిన్నభోంపల్లి గ్రామానికి చెందిన 9 మంది, మంత్రాలయం మండలం రాంపురం గ్రామానికి చెందిన ముగ్గురు, ఐరంగల్ గ్రామానికి చెందిన ఒకరు, జంపాపురం గ్రామానికి చెందిన ఒకరు, డి.బెళగల్ గ్రామానికి చెందిన ఒకరిని అరెస్టు చేసి వీరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది లక్ష్మీనారాయణ, బాలకృష్ణ, మునిస్వామి, షేక్షావలి, తదితరులు ఉన్నారు.

పర్వతారోహకుడికి చేయూత

- 'మార్గదర్శి-బంగారు కుటుంబం' కింద సాయం
- రూ.4లక్షలు అందించిన ఆర్సెల్ మిట్టల్ కంపెనీ



పర్వతారోహకుడు సురేష్‌బాబుకు రూ.4 లక్షల చెక్కును అందిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మార్గదర్శి-బంగారు కుటుంబం (పీ4- పాలసీ) కింద పర్వతారోహకుడికి చేయూతను అందించారు. శుక్రవారం గోనెగండ్ల మండలానికి చెందిన పర్వతా రోహకుడు సురేష్‌కు ఆర్సెల్‌మిట్టల్ కంపెనీ వారి ద్వారా రూ.4లక్షలు ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్‌ను కలెక్టర్ పి.రంజిత్ బాషా అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పీ-4పాలసీ కింద రాష్ట్ర ప్రభుత్వ 'మార్గదర్శి- బంగారు కుటుంబం' ద్వారా పేదలను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగంగా పర్వతారోహకుడు జి.సురేష్ బాబుకు ఆర్సెల్ మిట్టల్ కంపెనీ ద్వారా ఆర్థికసాయం అందించిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రాజా మహేంద్రనాథ్, ఆర్సెల్ మిట్టల్ కంపెనీ ప్రతినిధులు లక్ష్మీకాంత్, శ్రీధర్, సీపీవో హిమ ప్రభాకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

'సూర్యఘర్'పై అవగాహన కల్పించాలి

నంద్యాల కల్చరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్‌పై విస్తృతంగా అవగాహన కల్పించాలని తిరుపతి క్వాలిటీ కంట్రోల్ ఎనర్జీ సీజీ ఎం ఆడిట్ ఆదిశేషయ్య సూచించారు. శుక్రవారం నంద్యాల రామకృష్ణ కళా శాల ఆడిటోరియంలో విద్యుత్ శాఖ అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ ద్వారా వినియోగదారులకు లభించే వివిధ రాయితీలు గురించి ప్రతి ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. ఈ పథకం కింద బ్యాంకులు అతి తక్కువ వడ్డీతో రుణాలు ఇస్తున్నాయని చెప్పారు. సమావేశంలో విద్యుత్‌శాఖ నంద్యాల ఎస్ఈ సుధాకర్ కుమార్, ఈఈ శ్రీనివాసులురెడ్డి, ఎఈఈలు పాల్గొన్నారు.

తహసీల్దార్ల బదిలీ

కలెక్టర్ ఉత్తర్వులు

నంద్యాల నూనెపల్లె, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న తహసీల్దార్లను బదిలీ చేస్తున్నట్లు కలెక్టర్ రాజకుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాలలోని ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా ఉన్న ఎస్.హసీనా బీని స్పెషల్ తహసీల్దార్ టీజీపీ లోకాలిజేషన్ నంద్యాల యూనిట్‌కు, నంద్యాల అర్బన్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రియదర్శినిని నంద్యాల కలెక్టర్ కార్యాలయానికి బదిలీ చేశారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ స్థానం
డి.ఆల్ఫ్రెడ్	బండిఆత్మకూరు	కేఆర్ఆర్సీ, కలెక్టర్ ఆఫీస్ నంద్యాల
బి.సువర్ణ దేవి	అవుకు	ఉయ్యాలవాడ
పి.పద్మావతమ్మ	మహానంది	బండిఆత్మకూరు
వి.ప్రియదర్శిని	నంద్యాల అర్బన్	కలెక్టరేట్ నంద్యాల
ఎస్.రవికుమార్	చాగలమర్రి	డోన్
కె.నాగమణి	డోన్	శిరివెళ్ల
బి.పుష్పకుమారి	శిరివెళ్ల	అవుకు
ఎం.శ్రీనివాసులు	ఉయ్యాలవాడ	కొలిమిగుండ్ల
ఎస్.హసీనాబీ	ఏవో ఆర్డీవో కార్యాలయం	స్పెషల్ తహసీల్దార్, టీజీపీ లోకలిజేషన్

బదిలీల జాతర

- వైద్య ఆరోగ్యశాఖలో ముగిసిన దరఖాస్తు స్వీకరణ
- 8 వరకు దరఖాస్తుల పరిశీలన
- 15నుంచి 17వరకు కౌన్సెలింగ్, బదిలీ ఉత్తర్వులు
- ఉమ్మడి జిల్లా కేంద్రాలకు భారీగా డిమాండ్

నంద్యాల హాస్పిటల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ బదిలీల జాతర కొనసాగుతోంది. దరఖాస్తుల స్వీకరణ శుక్రవారంతో ముగిసింది. వైద్య ఆరోగ్యశాఖలో ఎంపీహెచ్ఎస్, రేడి యోగ్రాఫర్స్, ఎంపీహెచ్ఈవో, ఫార్మసీ ఆఫీసర్లు, వైద్య అధికారులు, ఎంపీహెచ్ఏలు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెండేళ్ల సర్వీస్ దాటినవారు రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్ కింద దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. మినిస్టీరియల్ సిబ్బంది మూడేళ్లు దాటితే కచ్చితంగా బదిలీ కావా లని నిబంధన పెట్టింది. వైద్యాధికారులు ఐదేళ్లు పూర్తిచేసుకున్న వారు బదిలీకి అర్హత పొందారు. జిల్లాస్థాయి అధికారి పోస్టులకు ఉమ్మడి జిల్లా కేంద్రాలకు భారీగా డిమాండ్ పెరిగినట్లు తెలు స్తోంది. వైసీపీ ప్రభుత్వం జిల్లాలు విభజన చేసిందే కానీ అధికా రాలు మాత్రం పాత జిల్లాకేంద్రాలకే ఇచ్చింది. దీంతో ప్రస్తుతం కొత్త జిల్లాల్లో పనిచేస్తున్న జిల్లాస్థాయి అధికారులకు బదిలీలపై ఎలాంటి అధికారాల్లేకపోవడంతో కేవలం ఉమ్మడి జిల్లా కేంద్రాల అధికారులకు దరఖాస్తులను ఫార్వర్డ్ చేయాల్సిన పరిస్థితి నెల కొంది. ఇప్పటివరకు ఆర్డీ స్థాయిలో 90, స్టేట్ స్థాయిలో 10, డీఎంహెచ్‌వో పరిధిలో 20మంది బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. సిబ్బందికి పోస్టింగ్ కోసం 5ప్లేస్‌లు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇచ్చింది. 6వ తేదీ నుంచి 8వ తేదీ దరఖాస్తులను పరిశీలిస్తారు. 9వ తేదీన అర్హత కలిగిన ఉద్యోగుల జాబితాను ప్రదర్శించనున్నారు. ఈ 15నుంచి 17వరకు కౌన్సెలింగ్ ఉంటుంది. అనంతరం బదిలీల ఉత్తర్వులు జారీ అవుతాయి.



జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం

డీఎంహెచ్‌వో పరిధిలో ఖాళీలు..

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో మల్టీపర్పస్ హెల్త్ సూపర్ వైజర్లు (మేల్)4, రేడియోగ్రాఫర్ 1, స్టాఫ్‌నర్స్‌లు 8, ఫార్మసీ ఆఫీ సర్లు 6, పబ్లిక్‌హెల్త్ నర్స్ (ఎన్‌టి)2, మల్టీపర్పస్ హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్ 6, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు (ఫిమేల్) ఉమ్మడి జిల్లాలో 22, వైద్య అధికారులు 12పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వైద్య అధికారుల పోస్టులు కొత్తగా ప్యాపిలి, ప్రాతకోట, పేరుసోముల, కొత్తపల్లె, బైర్లూటి, టంగుటూరు పీహెచ్‌సీలతో పాటు ముందుగా ఉన్న ఖాళీలు మరో 6ఉన్నాయి.

డీసీహెచ్ఎస్ పరిధిలో..

జిల్లాలో డీసీహెచ్ఎస్ పరిధిలో థియేటర్ అసిస్టెంట్లు 4, ల్యాబ్ టెక్నీషియన్ 1, ల్యాబ్ అటెండెంట్ 1, పోస్టుమార్టం అసిస్టెంట్లు 4, జూనియర్ అసిస్టెంట్లు 6, జీడీఏలు 16పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

సీనియర్ ఏఎన్ఎంలకు స్థానాల్లేవు

గత ప్రభుత్వంలో నియమించిన ఏఎన్ఎంలకు ప్రస్తుతం బదిలీల్లో జిల్లా కేంద్రం, ప్రధాన మండల కేంద్రాల్లో స్థానాల్లేకపోవడంతో వారు నిరాశగా ఉన్నారు. బదిలీల్లో వీరికి అవకాశం ఇచ్చినప్పటికీ గత ప్రభుత్వ హయాంలో సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత సచివాలయాల్లో ఏఎన్ఎంలను నియ మించి మూడేళ్లతర్వాత రెగ్యులర్ చేశారు. దీంతో ప్రస్తుతం సుదూర ప్రాంతాల్లో పనిచేస్తున్న హెల్త్‌అసిస్టెంట్లు అక్కడే పనిచేయాల్సిన పరిస్థితి. బదిలీల్లో భాగంగా రీ రిప్లాయ్‌మెంట్ రద్దవుతుందని సీనియర్ ఎంపీహెచ్ఏలు ఆశించారు.

పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించండి

కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్రహించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా పారిశ్రామిక, ఎగుమతి ప్రమోషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి అందిన దరఖాస్తులకు త్వరగా అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు. జిల్లాలో గత త్రైమాసిక కాలంలో వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతులు కోరుతూ 65 దరఖాస్తులు అందగా సింగిల్ డెస్క్ విధానంలో ఆయా శాఖల ద్వారా 53 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పరిశీలనలో ఉన్న 12 దరఖాస్తులను నిర్ణీత కాలవ్యవధిలోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం జవహర్‌బాబు, ఎల్‌డీఎం రవీందర్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ చాంబర్‌ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రాజమహేంద్రనాథ్, డిప్యూటి చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ఈఈ కిశోర్‌రెడ్డి, రవాణాశాఖ అధికారి ఐశ్వర్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో ముందస్తు పుట్టిన రోజు వేడుకలు

కర్నూలు హాస్పిటల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సింధూ సుబ్రహ్మణ్యం ముందస్తు పుట్టిన రోజు వేడుకలు చేసుకోవడం ప్రస్తుతం విమర్శలకు తావిస్తోంది. రేపు, ఎల్లుండి సెలవులు ఉండటంతో ముందుగానే పుట్టిన రోజు వేడుకలను హాస్పిటల్ ఆవరణలోని సార్టింట్ రూం ఎదుట ఏర్పాటు చేశారు. ఆసుపత్రిలో పని చేస్తున్న నర్సులు, హెల్త్ ఇన్‌స్పెక్టర్లు, నాల్గవ తరగతి సిబ్బంది సెక్యూరిటీ, శానిటేషన్ పెస్ట్ కంట్రోల్ ఉద్యోగులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ఉద్యోగులకు బిర్యానీ ప్యాకెట్లు, అన్నం ప్యాకెట్లు పంపిణీ చేశారు. 8 కొవిడ్ కేసులు ఉన్న ఆసుపత్రిలో ఇలా అంతమంది ఉద్యోగులు, ఏజెన్సీ ఉద్యోగులు గుమికూడి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించుకోవడం విమర్శలకు తావిస్తోంది. అది కూడా కొత్తగా ఏర్పాటు చేస్తున్న కొవిడ్ వార్డు సమీపంలో ఈ వేడుకలు జరుపుకోవడం విశేషం.



కేక్‌ను కట్ చేస్తున్న హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సింధూ సుబ్రహ్మణ్యం

యోగా గురువులకు 'యోగా భూషణ్' అవార్డులు

- 12 ఏళ్లు యోగాలో సేవ చేసినవారికి అవార్డు : మంగేష్ త్రివేది
- అవార్డు రావడం సంతోషంగా ఉంది: యోగా గురువులు



అవినాష్ శెట్టి



ముంతాజ్‌బేగం

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి):కర్నూలు జిల్లాకు చెందిన యోగా గురువులు డా.ఎస్. ముంతాజ్‌బేగం, రాష్ట్ర యోగా సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టికి అఖిల భారత యోగా శిక్ష సంఘం జాతీయ అధ్యక్షులు మంగేష్ త్రివేది ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో ఆదియోగి యోగా భూషణ్ అవార్డులను ప్రకటించారు. 12ఏళ్లకు పైగా యోగాలో సేవలందిస్తున్న వారికి ఈఅవార్డు ప్రదానం చేస్తు న్నట్లు మంగేష్ త్రివేది తెలిపారు. ఈ సందర్భంగా అవినాష్ శెట్టి, ముంతాజ్ బేగం మాట్లాడుతూ అఖిల భారత యోగా శిక్ష మహా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన ఢిల్లీలో అవార్డు అందుకుంటున్నందుకు సంతోషంగా ఉందన్నారు. తమను ప్రోత్సహించిన వారికి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వాసులకు అవార్డు రావడంపై యోగా సంఘం చైర్మన లక్ష్మీకాంతరెడ్డి, కర్నూలు జిల్లా ఒలంపిక్ సంఘం సీఈవో విజయకుమార్, అధ్యక్ష కార్యదర్శులు కేఈ జగదీష్‌కుమార్, శ్రీనివాసులు, క్రీడాసంఘాల కార్యదర్శులు డా.రుద్ర రెడ్డి, ఈశ్వర్ నాయుడు హర్షం వ్యక్తంచేశారు.

పూణే ల్యాబ్‌కు పరిశోధనలు

- శ్రీశైలం జలాశయం ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఆనకట్ట ప్లంజ్‌పూల్‌పై శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనలను పూణే ల్యాబ్‌కు తరలించినట్లు జలాశయం ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. ఐదు రోజుల నుంచి పూణెకు చెందిన శాస్త్రవేత్తల బృందం ప్లంజ్‌పూల్‌పై విస్తృతంగా పరిశోధనలు నిర్వహించారు. ఆ పరిశోధనల సమగ్ర నివేదికను ల్యాబ్‌లో పరిశీలించిన అనంతరం నివేదికలు సమర్పించనున్నారని ఎస్ఈ తెలిపారు. ప్రస్తుతం వైజాగ్ నుంచి వచ్చిన అండర్ వాటర్ వీడియోగ్రఫీ బృందం తమ పరికరాలు, ఇతర సామగ్రిని ఆనకట్ట వద్దకు చేర్చుకున్నారు. వాటర్ వీడియోగ్రఫీ 20 రోజుల పాటు కొనసాగుతుందని వివరించారు.



అండర్ వాటర్ వీడియోగ్రఫీ బృందం

మీదివేములలో భగ్గుమన్న ఫ్యాక్షన్

- మాజీ ఎంపీటీసీ హత్య నేపథ్యంలో గ్రామంలో పోలీసు బందోబస్తు
- నిందితుల కోసం గాలింపు

ఓర్వకల్లు/ కర్నూలు క్రైం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మీదివేముల గ్రామంలో మళ్లీ ఫ్యాక్షన్ భగ్గుమంది. గురువారం రాత్రి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ బోయ రమేష్‌నాయుడు(45) దారుణ హత్యకు గురి కావడం తెలిసిందే. నన్నూరు నుంచి ద్విచక్రవాహనంపై వస్తుండగా.. మీదివేముల సమీపంలో దిగువయ్య దర్గా మలుపు వద్ద కాపు కాచిన గుర్తు తెలియని దుండగులు బైక్‌ను ఆపి రమేష్‌నాయుడుపై బీరు సీసాలతో దాడి చేసి పొలంలోకి తీసుకెళ్లి రమేష్‌నాయుడు తలపై భారీ బండరాయితో మోది విచక్షణారహితంగా దాడిచేయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. శుక్రవారం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి సాయంత్రం గ్రామానికి తీసుకొచ్చారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మీదివేములలో గట్టి పోలీసు బందోబస్తు చేశారు. అంత్యక్రియలు ప్రశాంతంగా జరిగాయి. ఆరుగురు టీడీపీ నాయకులు మేడం రామాంజనేయులు, మేడం తిరుపాలు, బోయ బుగ్గరాముడు, మేడం నాయుడు, మేడం రాజు, మేడం శ్రీనివాసులపై మృతుని భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు వీరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు, ఓర్వకల్లు ఎస్‌ఐ సునీల్‌కుమార్ పర్యవేక్షణలో హత్య చేసిన నిందితుల కోసం గాలింపు చేపట్టారు. నన్నూరు, లొద్దిపల్లె, ఉయ్యాలవాడ వద్ద ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. హత్య చేసిన నిందితులను త్వరగా పట్టుకుని అరెస్టు చేస్తామని సీఐ చంద్రబాబునాయుడు తెలిపారు. మీదివేముల గ్రామంలో 1987లో అంటే 38ఏళ్ల తర్వాత ఫ్యాక్షన్ మొదలైంది. ఆ గ్రామానికి కరిమద్ది హత్య కేసులో 13 మంది నిందితులకు కారాగార శిక్ష విధించిన నేపథ్యంలో మళ్లీ గ్రామంలో ఫ్యాక్షన్ హత్య జరగడంతో గ్రామస్థులు భయాందోళనలకు గురవుతున్నారు. మాజీ ఎంపీటీసీ రమేష్ నాయుడు హత్యకు గురి కావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అంత్యక్రియలకు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కర్నూలు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి హాజరై నివాళులర్పించారు. మండలంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. మృతునికి భార్య కుమార్తె, కుమారుడు ఉన్నారు.


రమేష్‌నాయుడు (ఫైల్)

మృతుడి రాజకీయ నేపథ్యం

రమేష్ నాయుడు మొదటి నుంచి కర్నూలు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డికి సన్నిహితంగా ఉండేవాడు. 2014 స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ తరపున ఎంపీటీసీగా భారీ మెజారిటీతో గెలుపొందారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

- కాటసాని రాంభూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు,

మీదివేముల గ్రామ వైసీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ బోయ రమేష్ నాయుడు దారుణహత్యకు పాల్పడిన టీడీపీ నాయకులను చట్టపరంగా కఠినంగా శిక్షించాలి. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నందుకే టీడీపీ వర్గీయులు ఓర్వలేక ఆయనను హత్య చేశారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ


హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్‌పాటిల్

ఎస్పీ విక్రాంత్ పాటిల్ సంఘటనా స్థలాన్ని గురువారం రాత్రి పరిశీలించారు. గ్రామంలో పర్యటించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. మొదట ఇది రాజకీయ హత్యగా బావించిన పోలీసులు గ్రామంలో పెద్ద త్తున పోలీస్ పికెట్ ఏర్పాటుచేశారు. ఎలాంటి గొడవలు జరగకుండా పటిష్టమైన బందోబస్తును పోలీసులు చేపట్టారు.

బైక్ అదుపు తప్పి మహిళ మృతి


వైష్ణవి మృతదేహంతో రోధిస్తున్న అక్క దుర్గ

వెల్దుర్తి టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి పట్టణం సమీపంలోని నక్కలమిట్ట వద్ద జరిగిన బైక్ ప్రమాదంలో ద్విచక్రవాహనం నడుపుతున్న మహిళ వైష్ణవి (30) కింద పడి తలకు బలమైన గా యం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం శుక్రవారం జరిగింది. అనంతపురం పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన దుర్గ, వైష్ణవి అనంతపురం నుంచి వెలుగోడు మండలంలో జరుగుతున్న పూజా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు బయల్దేరారు. వెల్దుర్తి పట్టణ సమీపంలోని నక్కలమిట్ట వద్ద బైక్ అదుపు తప్పడంతో ఇద్దరూ కింద పడ్డారు. వైష్ణవి తలకు గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా.. దుర్గకు స్వల్పగాయాలు అయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వారిని వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరు వరుసకు అక్కాచెల్లెళ్లు అవుతారని, వైష్ణవి ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి కుటుంబానికి సమాచారం ఇచ్చామన్నారు.

జనని బ్యాంకు కేసులో ఇద్దరి అరెస్టు

కోవెలకుంట్ల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : జనని సహకార సంఘం బ్యాంకు కేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు కోవెలకుంట్ల సీఐ హనుమంత నాయక్ తెలిపారు. శుక్రవారం కోవెలకుంట్ల పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను హాజరుపరిచారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జనని మ్యూచువల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ పొదుపు, పరపతి సొసైటీ లిమిటెడ్ బ్యాంకును అక్టోబరు 2021లో కోఆపరేటివ్ రిజిస్టరు ఆఫీసు కర్నూలులో రిజిస్టరు చేయించి ఇందులో కీలక పాత్ర పోషించిన కడప జిల్లా సీకేదిన్నె మండలం సోమవాండ్లపల్లెకు చెందిన ఆకుల వెంకటరమణ, కోవెలకుంట్ల టౌన్ గడ్డమీదికి చెందిన గువ్వల పద్మావతి ఉన్నారు. వీరు మరికొంత మందితో కలిసి ఒక పథకం ప్రకారం కోవెలకుంట్ల చుట్టుపక్కల ప్రజలతో డబ్బులు కట్టించి ఎక్కువ వడ్డీలు ఇస్తామని ఆశ చూపి కొంత మందికి లోన్లు ఇచ్చి ప్రజల నుండి స్వీకరించిన డబ్బులు దుర్వినియోగం చేసేందుకు పన్నాగం పన్నారు. ఈ మేరకు జనని బ్యాంకులో వేసిన డబ్బులను సీఈవో వెంకట్రమణ లింకు ఇప్పించి డబ్బులను వేర్వేరు అకౌంట్లలోకి బదిలీ చేసి వచ్చిన నగదు కూడా వారి సొంతానికి వాడుకున్నారు. రెండు, మూడు సంవత్సరాల ఫిక్స్ డ్ డిపాజిట్‌లో సేవింగ్స్ చేసుకున్న వారికి గడువు అయిపోయినా డబ్బులు తిరిగి ఇవ్వలేదు. డబ్బులు అడిగితే బెదిరిస్తున్నారని బాధితులు బుధవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసును దర్యాప్తు చేయగా ఇప్పటి వరకు ఐదుగురు వ్యక్తులు మోసపోయినట్లు తెలిపారు. మొత్తం రూ.13.45 లక్షలు మోసపోయినట్లు తెలిపారు. జనని బ్యాంకులో గడువు తీరినా డబ్బులు పొందని వారు ఇంకా ఉంటే వారు ఉంటే తమను సంప్రదించాలని సీఐ తెలిపారు. సొసైటీ సీఈవో రమణ పద్మావతి తదితరులపై కేసు నమోదు చేశామని, మిగతా వారిని త్వరలో అరెస్టు చేస్తామని సీఐ తెలిపారు.

ఆశల ఖరీఫ్!

5వ పేజీ తరువాయి

పుస్తకం సర్దుబాటు పేరుతో..



స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ రూల్స్ ప్రకారం పంట రుణాలు రూ.3,150 కోట్లు ఇవ్వాలని లక్ష్యం. పంటరుణాల కోసం బ్యాంకులకు వెళితే రెన్యువల్ పేరుతో పుస్తకం సర్దుబాటు చేస్తున్నారు. రికార్డుల్లో ఖరీఫ్ పంట రుణం ఇచ్చినట్లు చూపుతారు. పెట్టుబడి అప్పుల కోసం అవస్థలు తప్పడం లేదు. ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అధిక వడ్డీలకు అప్పులు చేసి నష్టపోతున్నారు.

కౌలు రైతులపై కరుణేదీ?



జిల్లాలో కౌలురైతులు 25వేల మంది ఉన్నారని అధికారిక లెక్కలు. అనధికారిక లెక్కలు ప్రకారం 50 వేలకు పైగా ఉన్నారని అంచనా. గతేడాది 23,350 మంది కౌలు రైతులకు హక్కు పత్రాలు జారీ చేసినా.. పంట రుణాలు ఇచ్చింది మాత్రం కేవలం 132 మంది రైతులకు రూ.65 లక్షలే. ఈ ఏడాదైనా హక్కు పత్రాలు ఉన్న రైతులు అందరికి పంట రుణాలు ఇప్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఊరట కల్పించిన 'మద్దతు'



2025-26 ఖరీఫ్ సీజన్‌కు సబంధించిన 14 ముఖ్యమైన పంటలకు మద్దతు ధర కేంద్ర ప్రభుత్వం ఖరారు చేసింది. గతేడాదిలో పోలిస్తే.. క్వింటాపై వరి ధాన్యం పంటకు ధర రూ69, జిల్లాలో అత్యధికంగా సాగు చేస్తున్న పత్తికి రూ.589 పెంచారు. పంటలు ఉత్పత్తి వ్యయంలో 50 శాతానికి పైగా ఆదాయం ఉండేలా ఎంఎస్‌పీ నిర్ణయించారని వ్యవసాయ నిపుణులు అంటున్నారు. పెరిగిన ధరలు ప్రకారం క్వింటా వరి సాధారం రూ.2,369, గ్రేడ్-ఏ రూ.2,389లకు, పత్తి మధ్యస్థ రకం రూ.7,710లకు, పింది పొడవు రకం పత్తి రూ.8.110లకు, కంది రూ.8,000, పెసలు రూ.8,768లకు, మినుము రూ,7,800లకు, వేరుశనగ రూ.7,263లకు, సూర్య కాంతి రూ.7,690లకు చేరింది. ఎంఎస్ పీ పెంచడంతో రైతులకు ఊరట కల్పిస్తుంది.

జిల్లాకు కేటాయించిన విత్తనాలు (క్వింటాళ్లు), క్వింటా ధరపై రాయితీ (శాతం) వివరాలు

విత్తన రకం	కేటాయింపు	రాయితీ
వేరుశనగ	9,099	40 శాతం
కంది	892.50	30
మినుము	25	30
పెసర	10	30
కొర్రలు	70	50
జీలుగ	154	50
పిల్లిపెసర	11	50

అన్నదాత సుఖీభవ



● ఖరీఫ్ లక్ష్యం (హెక్టార్లలో):

పంటలు	లక్ష్యం
వరి	12,919
వేరుశెనగ	54,710
పత్తి	2,34,409
కంది	33,296
సజ్జ	3,939
మొక్కజొన్న	5,101
కొర్ర	2,679
ఆముదం	8,951
మిరప	36,222
ఉల్లి	16,577
వాము	564
టమోటా	2,890
పొగాకు	1,415
ఇతర పంటలు	8,868
మొత్తం	4,22,540

టీడీపీ కూటమి గత ఎన్నికల ముందు 'సూపర్ సిక్స్'లో భాగంగా 'అన్నదాత సుఖీభవ పథకం' కింద రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఆర్థిక సాయం చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. కేంద్రం పీఎం కిసాన్ పథకం కింద ఇచ్చే రూ.6 వేలు సాయంతో కలిపి అన్నదాత సుఖీభవ పథకం సాయం ఈ ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో ఇస్తామని సీఎం చంద్రబా బు స్పష్టత ఇచ్చారు. జిల్లాలో 2.50 లక్షల రైతు కుటుంబాలు ఉన్నాయి. 2025 ఖరీఫ్ సీజన్ ఆరంభానికి ముందే ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన (పీఎం కిసాన్) తొలి విడత రూ.2 వేలు చొప్పు న రూ.50 కోట్లు, రాష్ట్రం ప్రభుత్వం ఇచ్చే అన్నదాత సుఖీభవ సాయం రూ.4,500 చొప్పున రూ.112 కోట్లు రైతు ఖాతాలో జమ చేయాల్సి ఉంది. రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

నేడు తెలంగాణ డిప్యూటీ సీఎం రాక

- పిన్నాపురంలో ప్రాజెక్టుల పరిశీలన

కర్నూలు, అర్బన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటించనున్నారని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జె.లక్ష్మీనరసింహయాదవ్ తెలిపారు. శుక్రవారం కర్నూలు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం ఉదయం 6గంటలకు బేగంపేట నుంచి రోడ్డు మార్గం ద్వారా బయలుదేరి కర్నూలు నగర శివారులోని టోల్‌ప్లాజాకు ఉదయం 8.30కు చేరుకుంటారన్నారు. ఉమ్మడి జిల్లాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలుకుతారని తెలిపారు. అక్కడి నుంచి పాణ్యం నియోజవర్గం పరిధిలోని పిన్నాపురంలో నిర్మాణ దశలో ఉన్న ఇరిగేటెడ్ రెనెవబుల్ ఎనర్జీ ప్రాజెక్టు (ఐఆర్ఈపీ) పనుల తీరును మాజీ పీసీసీ గిడుగు రుద్రరాజుతో కలిసి పరిశీలించనున్నారు. అనంతరం ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల కాంగ్రెస్ నాయకులతో సమావేశమై కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తీసుకుంటున్న చర్యలు, ప్రణాళికలపై చర్చించనున్నారు. తిరుగు ప్రయాణం కర్నూలు మీదుగా హైదరాబాద్‌కు బయలుదేరుతారని తెలిపారు. సమావేశంలో నగర అధ్యక్షుడు జిలానీబాషా, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

చనిపోతూ ఆరుగురికి పునర్జన్మ

- బ్రెయిన్ డెడ్‌కు గురైన పంచాయతీ సెక్రటరీ
- అవయవదానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులు

కర్నూలు హాస్పిటల్/ గోస్పాడు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్ అయిన నంద్యాల జిల్లా గుంటనాల పంచాయతీ సెక్రటరీ సుజాత (31) బ్రెయిన్ డెడ్ అయింది. బ్రెయిన్ డెడ్ అయిన ఆ పంచాయతీ సెక్రటరీ అవయవదానానికి కుటుంబ సభ్యులు అంగీకరించడంతో ఆరుగురికి పునర్జన్మ ఇచ్చారు. నంద్యాల జిల్లా నంద్యాల మండలం గుంతనాల గ్రామానికి చెందిన సుజాత గోస్పాడు మండలంలోని తేళ్లపురి గ్రామంలో పంచాయతీ సెక్రటరీగా పనిచేస్తున్నారు. గత నెల 28వ తేదీ విధి నిర్వహణలో నంద్యాల జిల్లా గోస్పాడు మండలం తెల్లపురి గ్రామంలో ద్విచక్రవాహనంపై వెళ్తూ కింద పడిపోయి తలకు తీవ్ర గాయం కావడంతో నంద్యాలకు కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం ఆమెను ఈ నెల 4వ తేదీన కర్నూలు కిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. దురదృష్టవశాత్తు శుక్రవారం ఉదయం ఆమె బ్రెయిన్ డెడ్ అయింది. దీంతో కర్నూలు డిస్ట్రిక్ట్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి, కుటుంబ సభ్యులైన అక్క, తమ్ముడికి అవగాహన కల్పించడంతో వారు అవయవదానానికి ముందుకు వచ్చారు. అనంతరం సుజాత బంధువులు, తల్లిదండ్రులు అంగీకారంతో రెండు ఊపిరితిత్తులు, రెండు కళ్లు, రెండు కిడ్నీలను దానం చేశారు. ఇందులో రెండు ఊపిరితిత్తులను హైదరాబాదు కిమ్స్ హాస్పిటల్‌కు, రెండు కళ్లను హైదరాబాదు ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు రెండు కిడ్నీలను కర్నూలు కిమ్స్‌కు తరలించారు. అవయవాల తరలింపునకు కిమ్స్ హాస్పిటల్ సీఈవో సునీల్ కుమార్ ఏర్పాట్లు చేశారు. అవయవాలను తరలించేందుకు పోలీసులు గ్రీన్ చానల్‌ను ఏర్పాటు చేసి వాటిని వేగంగా తరలించినట్లు కిమ్స్ హాస్పిటల్ సీఈవో సునీల్ కుమార్ తెలిపారు. అనంతరం అవయవదానం చేసేందుకు అంగీకరించిన సుజాత అక్క, తమ్ముడు, తల్లిదండ్రులు, బంధువులను కిమ్స్ హాస్పిటల్ సీఈవో సునీల్ కుమార్, కర్నూలు రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డా.గోవిందరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా జీవనధార నుంచి చెక్కును అందజేశారు.


జీవన్‌ధాన్ నుంచి చెక్కును కుటుంబ సభ్యులకు అందిస్తున్న డాక్టర్ గోవిందరెడ్డి


సుజాత (ఫైల్)

అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తా

- రైతులకు మేలు చేస్తా
- సీఎం నమ్మకాన్ని నిలబెట్టుకుంటా
- డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి
- ఘనంగా ప్రమాణ స్వీకారోత్సవం


బాధ్యతలు స్వీకరిస్తున్న కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి


విష్ణువర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎంపీ,ఎమ్మెల్యే, నాయకులు

కర్నూలు అగ్రికల్చర్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మంత్రులు, ఎమ్మెల్యేలు, రెండు జిల్లాల ఎంపీలు, టీడీపీ ముఖ్యనేతలు, రైతుల సహకారంతో బ్యాంకు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానని జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కాన్ఫరెన్స్ హాల్లో బ్యాంకు చైర్మన్‌గా రైతుల సమక్షంలో ఘనంగా ప్రమాణస్వీకారోత్సవం చేశారు. ఈ కార్యక్రమానికి కోడుమూరు, పాణ్యం, కర్నూలు నియోజకవర్గాల నుంచి పెద్దఎత్తున రైతులు, అనుచరులు, టీడీపీ వర్గాలు తరలి వచ్చారు. ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్యఅతిథులుగా కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కేడీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, పరిశీలకుడు రామలింగేశ్వర రెడ్డి, ఇతర నాయకులు బొజ్జన్న పాల్గొన్నారు. బ్యాంకు సీఈవో రామాంజనేయులు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డితో ప్రమాణ స్వీకారోత్సవాన్ని చేయించారు. ఈ సం దర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి ఎంతో భావోద్వేగంతో తన ప్రసంగాన్ని కొనసాగించారు. తన తనయుడు రాజవర్ధన్‌రెడ్డి ప్రజలతో మమే కమై వారి కష్టసుఖాలే తన జీవనంగా కొనసాగించారని, అకాల మరణంతో తాను ఎంతో బాధ అనుభవించినా చివరకు ఆయన ఆశయాన్ని సాధించేందుకు టీడీపీ వేదికగా కష్టపడుతూ వచ్చాన న్నారు. తనమీద నమ్మకంతో సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్‌గా పదవి ఇచ్చారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని రైతుల సమక్షంలో ప్రకటించారు. ఏనాడూ పదవుల కోసం ఆరాట పడలేదని, ప్రజల కష్టాసుఖాల్లో పాలుపంచుకోవడానికే ప్రతిక్షణం ఆరాటపడ్డానని అన్నారు. తెలుగుదేశం పార్టీలో ఎప్పటి నుంచో ఒక సైనికుడిలా పని చేశానన్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా రైతులకే కాకుండా పొదుపులక్ష్మి మహిళలకు, అన్ని వర్గాల వారికి ఆర్థిక చేయూత అందిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ విష్ణువర్ధన్ రెడ్డి కర్నూలు జిల్లాలో టీడీపీ తిరుగులేని విధంగా గొప్ప స్థానాన్ని అందించారన్నారు. అనంతరం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈవో రామాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలోనే కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉందని, రాబోయే కాలంలో రూ.6వేల కోట్ల వ్యాపారాన్ని పెంచుకుని మూడో స్థానానికి ఎదిగేందుకు చైర్మన్ తమకు అం డగా ఉండాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి రామాంజనేయులు, బ్యాంకు బీఎం శివలీల, డీజీఎంలు నాగిరెడ్డి, సునీల్ కుమార్, ఉమామహేశ్వరరెడ్డి, ఏజీఎంలు త్రినాథ్ రెడ్డిలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల మనిషి విష్ణువర్ధన్ రెడ్డి : తిక్కారెడ్డి

కోడుమూరు నియోజకవర్గంతో పాటు కర్నూలు జిల్లాలో ఒక బలమైన నాయకుడిగా, ప్రజల మనిషిగా విష్ణువర్ధన్ రెడ్డి గుర్తింపు తెచ్చుకున్నారనీ టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. సీఎం చంద్రబాబు ఉమ్మడి జిల్లా సహకార బ్యాంకు చైర్మన్ పదవిని విష్ణువర్ధన్‌రెడ్డికి అప్పగించడం సంతోషంగా ఉందన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శుక్రవారం మాధవీ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజల నుంచి గౌరు చరిత వినతులు స్వీకరించారు. గౌరు చరిత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజల సమస్యల దృష్టి సారించామన్నారు. కల్లూరు అర్బన్‌లోని శివారు ప్రాంతాల్లో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్ దీపాలు, పార్కుల అభివృద్ధి తదితర సమస్యలను ప్రజలు, టీడీపీ నాయకులు ఎమ్మెల్యేకు వివరించారు.

పనికి తగ్గ వేతనం అందించాలి

కర్నూలు అగ్రికల్చర్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మార్కెట్ కమిటీల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు పనికి తగ్గ వేతనం అందించాలని ఏపీ మార్కెట్ కమిటీల ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ ఉపాధ్యక్షుడు కిరణ్ కోరారు. శుక్రవారం విజయవాడలో జరిగిన మార్కెట్ కమిటీల ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి సమావేశానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ హాజరై ప్రసం గించారు. ప్రభుత్వం తమకు టైం స్కేల్ వర్తింపజేసేందుకు గతంలో జారీ చేసిన 814 జీవోను వెంటనే అమలు చేయాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పదవీ విరమణ కాలాన్ని 62 సంవత్సరాలు చేయాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మరణిస్తే కుటుంబ సభ్యులకు రూ.5లక్షలు ఆర్థిక సాయం అం దించాలని, ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వెల్ఫేర్ వర్కింగ్ ప్రెసిడెంటు నక్క వెంకటరత్నం, నాయకులు శ్రీరాములు, బతుకన్న, చెంచన్న పాల్గొన్నారు.

13న మండల సర్వసభ్య సమావేశం

ఓర్వకల్లు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు మండల సర్వసభ్య సమావేశం ఈనెల 13న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీపీ తిప్పన్న అధ్యక్షత వహిస్తారన్నారు. ముఖ్యఅతిథులుగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో గతంలో చర్చించిన అంశాలు, వటి పురోగతిపై చర్చ ఉంటుందన్నారు. ఈసమావేశానికి ఆయా శాఖ ల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు.

పొదుపు మహిళలు ఆర్థికంగా ఎదగాలి: ఏపీఎం

సి.బెళగల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళలు ఆర్థికంగా ఎదగాలని వెలుగు ఏపీఎం రమేష్ అన్నారు. శుక్రవారం సి.బెళగల్‌లోని మండల వెలుగు కార్యాలయంలో బుక్ కీపర్లతో సమావేశం నిర్వహిం చారు. రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న రుణాలను పొదుపు మహిళలకు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈసమా వేశంలో బుక్‌కీపర్లు, సీసీలు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు సహకరించాలి

కర్నూలు నియోజకవర్గ ఆర్వో రవీంద్రబాబు



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఆర్వో రవీంద్రబాబు

కర్నూలు న్యూసిటీ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేసేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కర్నూలు నియోజకవర్గ ఆర్వో, కార్పొరేషన్ కమిషనర్ రవీంద్ర బాబు అన్నారు. శుక్రవారం నగర పాలక కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతి పోలింగ్ స్టేషన్‌కు బీఎల్‌వో ప్రభుత్వం తరపున ఉంటారని, రాజకీయ పార్టీల తరపున బీఎల్‌వో ద్వారా అర్హులైన వారితో దరఖాస్తు చేయించి ఓటరుగా నమోదు చేయించాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఎప్పుడైనా ఓటరు నమోదు చేయించుకోవచ్చని ప్రతినిధులకు తెలిపారు. ఆన్‌లైన్ ఓటరు నమోదుకు సంబంధిత ఓటర్ ఫోన్ నెంబరుకు వన్‌టైం పాస్‌వర్డ్ వస్తుందని, దాని ద్వారా ఓటరు నమోదు జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు డబ్ల్యూ ధనుంజయ, సూపరింటెండెంట్ సుబ్బన్న పాల్గొన్నారు.

విష్ణు ప్రమాణ స్వీకారానికి టీడీపీ శ్రేణులు



విష్ణువర్ధన్‌రెడ్డికి బొకె అందజేస్తున్న టీడీపీ నాయకులు

కర్నూలు రూరల్ జూన్ 6(ఆంధ్రజ్యోతి): కోడుమూరు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకుడు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి శుక్రవారం ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్‌గా పదవీ స్వీకారం చేశారు. మధ్యాహ్నం 12గంటలకు కర్నూలులోని నెహ్రూనగర్‌లో ఉన్న తన ఇంటి నుంచి కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, పార్టీ పరిశీలకులు రామలిం గారెడ్డితో కలిసి బయలుదేరారు. అప్పటికే కోడుమూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాలు నుంచి భారీగా టీడీపీ శ్రేణులు కర్నూలుకు తరలివచ్చారు. విష్ణువర్ధన్‌రెడ్డి వాహనాన్ని అనుసరిస్తూ టీడీపీ శ్రేణులు ర్యాలీ చేశారు. అనంతరం విష్ణువర్ధన్‌రెడ్డి కేడీసీసీబీ కార్యాలయానికి చేరుకొని ఆయనకు కేటాయించిన ప్రత్యేక చాంబర్‌లో చైర్మన్‌గా రికార్డులో సంతకం చేసి పదవీ బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, ఎంపీ నాగరాజు విష్ణువర్ధన్‌రెడ్డిని శాలువ కప్పి బొకె అందజేసి సత్కరించారు.

● కర్నూలు మండలం బి.తాండ్రపాడు సర్పంచు ఆకెపోగు జయన్న ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రమాణ స్వీకారోత్సవానికి తరలివచ్చారు. విష్ణువర్ధన్‌రెడ్డిని పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ పూలరామకృష్ణ, నాయకులు వనుములయ్య, రసూల్, మద్దయ్య, కిషోర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● గార్గేయపురం గ్రామానికి చెందిన టీడీపీ యువ నాయకుడు జూటూరు కౌశిక్‌రెడ్డి, బి.తాండ్రపాడు ఎంపీటీసీ సభ్యులు కురువ మద్దిలేటిలు కేడీసీసీబీ చెర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డికి శాలువకప్పి సన్మానించారు.

● సూదిరెడ్డిపల్లెకు చెందిన టీడీపీ నాయకులు బి.వెంకట్రాముడు, బి.శ్రీనివాసులు, బి.వెంకటేశ్వర్లు, బి.శ్రీకాంత్ కలిసి విష్ణువర్ధన్‌రెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయనకు శాలువ కప్పి, పూల మాలతో సన్మానించారు.

● నందనపల్లె గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కేశ వేమన్నగౌడ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు భారీగా తరలివ చ్చారు. అనంతరం వేమన్నగౌడ్ విష్ణుని కలిసి శాలువ కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

● సుంకేసుల గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ తెలుగు గంగాధర్ విష్ణును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విష్ణుకు శాలువ కప్పి సన్మానించారు.

● బి.తాండ్రపాడుకు చెందిన టీడీపీ నాయకుడు పేరపోగు పెద్ద లక్ష్మన్న పార్టీ కార్యకర్తలతో వచ్చి విష్ణుకి శాలువ కప్పి సత్కరించారు.

కోడుమూరు రూరల్: కోడుమూరు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నేత విష్ణువర్ధన్‌రెడ్డి కేడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా శుక్రవారం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మండలం నుంచి టీడీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డిని గజమాల, శాలువాతో సన్మానించారు. లద్దగిరి గ్రామం నుంచి పట్టె క్రిష్ణ, పట్టె మధు, జయన్న, గోరంట్లలో కున్నూరు మధు, గిడ్డయ్య, మల్లయ్య, ముడుమలగుర్తి మధు, మల్లేష్, వెంకటగిరి రాజు, అను గొండ రామక్రిష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు ప్యాలకుర్తి ఉగాది వెంకటేశ్వర్లు, రంగన్న తదితరులు వెళ్లారు.

గూడూరు: రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని పట్టణ టీడీపీ అధ్యక్షుడు కే.రామాంజనేయులు అన్నారు. శుక్రవారం గూడూరు పట్టణంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పెద్ద ఎత్తున కర్నూలుకు తరలివెళ్లి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్‌గా విష్ణువర్ధన్ రెడ్డి ప్రమాణ స్వీకారానికి హాజరై ఆయనకు పూలమాలలు వేసి శాలువలతో సన్మానించారు. టీడీపీ నాయకులు రేమట వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు రేమట సురేష్, చాంద్‌బాషా పాల్గొన్నారు.



విష్ణువర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న గోరంట్ల, లద్దగిరి, గూడూరు టీడీపీ నాయకులు

డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా మార్పు



ప్రభుత్వ ఉత్తర్వు కాపీలను డీఎంహెచ్‌వోకు అందజేస్తున్న డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్లు

కర్నూలు హాస్పిటల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్య శాఖలో పనిచేస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్లు హోదాను ప్రభుత్వం డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా మార్పుచేసింది. ఈమేరకు ఆరోగ్య వైద్య ఆరో గ్య కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై శుక్రవారం సాయంత్రం ఏపీ రాష్ట్ర హెల్త్ ఎడ్యుకేటర్స్ సర్వీసు, వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్య క్షుడు డబ్లూ రమణ, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పద్మావతి, కర్నూలు జిల్లా అధ్యక్షురాలు సుభాషిణి, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ యాదవ్, ప్రభాకర్ రెడ్డి, కృష్ణారెడ్డి, రాఘవేంద్రగౌడు, షణ్ముకుడు, ఈశ్వరయ్య డీఎంహెచ్‌వో పి.శాంతికళను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో హెల్త్‌ఎడ్యుకేటర్లు మారుమూల ప్రాంతాల్లో ఆరోగ్య విద్య ద్వారా అవగాహన కల్పిస్తున్నారని, సమాజంలో కొత్తగా వ్యాపిస్తున్న అంటు వ్యాధుల నియంత్రణలో ముందుగా ప్రజలను చైతన్య పరుస్తున్నారని వారు డీఎంహెచ్‌వోకు వివరించారు. హెల్త్ ఎడ్యుకేటర్ పోస్టు హోదాను మార్పు చేయడంపై సీఎం చంద్రబాబు, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కర్నూలు ఏజీపీగా సయ్యద్ షాబుద్దీన్



కర్నూలు లీగల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కర్నూలు అసిస్టెంట్ గవర్నమెంటు ప్లీడర్‌గా సీనియర్ న్యాయ వాది సయ్యద్ షాబుద్దీన్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభు త్వం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ఈయన గత 20 సంవత్సరాలుగా కర్నూలులో పలు సివిల్, క్రిమినల్ కేసుల్లో వాదించిన అనుభవం ఉంది. ఈయన కర్నూలు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులలో ప్రభుత్వం తరపున సివిల్ దావాలలో వాదిస్తారు. ఈయన మూ డేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. ఈయన నియామకం పట్ల న్యాయవాదులు బాబు సాహేబ్, ఎస్.చాంద్ బాషా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరినాథ చౌదరి, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు హర్షం వ్యక్తం చేశారు.

కార్మికులకు వేతనాలు పెంచాలి: సీఐటీయూ

కర్నూలు న్యూసిటీ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీలో పని చేస్తున్న అద్దె బస్సుల కార్మికులకు వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం కేకే భవన్‌లో యూనియన్ నాయకులు శ్రీనివాసులు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో అంజిబాబు మాట్లాడారు. గతంలో అద్దె బస్సుల కార్మికులతో మరోసారి యూనియన్‌తో చర్చలు జరిపి కొత్త ఒప్పందం చేసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రాంబాబు, నాగేంద్ర, మద్దిలేటి, సుంకన్న, శ్రీకాంత్, రాఘవేంద్ర, సాయిబాబా, షేక్షావలి పాల్గొన్నారు.

రేపటి నుంచి అవగాహన సదస్సు

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): స్థానిక బిర్లా కాంపౌండులో కృష్ణాకాంత్ ప్లాజాలో క్యాండెట్ డిఫెన్స్ అకాడమిలో ఈ నెల 8, 9 తేదీల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కర్నూలులో నవోదయ ఆర్ ఎంఎస్, కలికిరి, కోరుకొండ, సైనిక్ స్కూల్స్ ప్రవేశాల కోసం కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంస్థ డైరెక్టర్లు కస్తూరి చంద్రశేఖర్, పరుశురాం పాల్గొన్నారు.

చరిత్ర అధ్యాపకురాలికి డాక్టరేట్



విజయలక్ష్మి

కర్నూలు అర్బన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు జి.విజయలక్ష్మికి డాక్టరేట్ వరించింది. వెంకటేశ్వర యూనివర్సిటీ చరిత్ర ఆచార్యులు ఎస్.కృష్ణారెడ్డి పర్యవేక్షణలో తమిళనాడులో తెలుగు శాసనాలు, సా మాజిక సంస్కృతిక ఆధ్యాయనం అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పిం చారు. ఈ క్రమంలో ఎస్వీయూ పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ బీ. రాజమాణిక్యం డాక్టరేట్‌ను జారీచేశారు. విజయలక్ష్మి యూ పబ్లికేష న్లను, దాదాపు 14కు పైగా జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పత్ర సమర్పణ చేశా రు. డాక్టరేట్ అందుకున్న విజయలక్ష్మి, పరిశోధన గైడ్ డాక్టర్ ఎస్. కృష్ణారెడ్డిలను క్లస్టర్ యూనివర్సిటీ ఇన్‌చార్జి ఉపకులపతి వి.వెంకట బసవరావు, రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ వెంకట రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

ధర్నాను జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కులో తొల గించిన 2500 కార్మికులకు విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 9న తలపెట్టిన ప్రదర్శన, ధర్నాను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో సీఐటీయూ జిల్లా కార్య దర్శి ఎండీ అంజిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెల 20 నుంచి విశాఖ ఉక్కు కార్మికులు చేస్తున్న సమ్మెను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భగ్నం చేసేందుకు కుట్రలు పన్ను తున్నాయన్నారు. తొలగించిన కార్మికులకు విధులలోకి తీసుకోవాలని, పెం డింగ్ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాక్రిష్ణ, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి సురేష్‌నాయక్, జి.చంద్రశేఖర్, రామాంజనేయులు, విజయ్, సాయిబాబా, ఈశ్వర్ పాల్గొన్నారు.

ప్రతిభను మెరుగుపరుచుకోవాలి

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రతిభను మెరుగుపరుచుకోవాలని నారాయణ పాఠశాలల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమాదేవి అన్నారు. శుక్రవారం స్థానిక ఏల్కూరు బంగ్లాలోని నారాయణ పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో రమాదేవి పాల్గొని మాట్లాడారు. నారాయణ పాఠశాల విద్యార్థులకు ప్రతిభా అవార్డులు హర్షణీయమని, అందుకు ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందని అన్నారు. ప్రతిభ అవార్డులు సాధించిన విద్యార్థులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో ఆర్అండ్ డీ నరేష్, కోఆర్డినేటర్ భాగ్యలక్ష్మి, క్లస్టర్ ప్రిన్సిపాల్ అన్వర్‌బాషా, ప్రిన్సిపాల్ మహ్మద్ అల్తాఫ్, ఏడీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి ఆర్థిక సాయం

కర్నూలు కల్చరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): థాయ్‌ల్యాండ్‌లో ఈనెల 10 నుంచి 15 వరకు జరుగనున్న ఎస్ఎస్‌డీఎఫ్ థాయ్‌ల్యాండ్ పారా బ్యాడ్మింటన్ ఇంటర్నేషనల్ 2025 లెవెల్-2 పోటీలకు భారత్ తరఫున ఆడనున్న క్రీడాకారుడు రామాంజనేయులకు ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోపా) కర్నూలు శాఖ తరఫున రూ.10వేలు ఆర్థిక సాయం ఆవోపా ప్రతినిధులు అందజేశారు. శుక్రవా రం జోహరాపురం రోడ్డులోని క్రీడాస్థలిలో ఆవోపా అధ్యక్షుడు డాక్టర్ పి. లక్ష్మీనారాయణ, సభ్యులు యుగంధర్‌శెట్టి, టీవీ రత్నప్రసాద్, రామచం ద్రరావు, సతీష్, నాగేశ్వరరావులు హాజరై క్రీడాకారుడికి రూ.10వేలు చెక్కు అందజేశారు.

త్యాగానికి ప్రతిరూపం బక్రీద్

కర్నూలు కల్చరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): త్యాగానికి ప్రతిరూపం బక్రీద్ పండుగ అని రోజా మహిళా ఐక్య సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత అన్నారు. శుక్రవారం రాత్రి బక్రీద్ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న నగరంలో బక్రీద్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

● కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఇంజనీరింగ్ కార్మికుల వంటా వార్పు



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట వంటా చేస్తున్న కార్మికులు

కర్నూలు న్యూసిటీ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం మూడో రోజుకి చేరింది. ఇందులో భాగంగా కార్మికులు వంటా వార్పు చేసుకుని అక్కడే భోజనాలు చేశారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికులందరికీ కనీస వేతనం రూ.24.500 ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించని పక్షంలో నీటి సరఫరా, వీధి దీపాలు ఆపేస్తామని హెచ్చరించారు.. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి సమీర్ బాషా, ఉపాధ్యక్షుడు నాగశేషులు, జిల్లా అధ్యక్షుడు మనోహర్, కార్యదర్శి యాసిన్‌బేగ్, గంగమ్మ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటం

గూడూరు: మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటం చేస్తామని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు అరవింద్, బసవరాజు అన్నారు. శుక్రవారం గూడూరు పట్టణంలో ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె 31వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీధి లైట్లను ఆర్పి నిరసన తెలిపామన్నారు. అలాగే 7వ తేదీ నుంచి తాగునీటి సరఫరా పూర్తిగా నిలిపివేసి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరిం చారు. ఇంజనీరింగ్ కార్మికులు మధు, ఆంజనేయులు, జయన్న, ప్రభాకర్, షబ్బీర్, ఆలీబాషా తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకూడదు: ఎంపీ

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకూడదని, సాధించాలనే తపన ఉంటే ఏదైనా సాధించవచ్చని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. శుక్రవారం స్థానిక ఎన్ఆర్‌పేటలోని శ్రీలక్ష్మి పాఠశాలలో ఇనాక ఆధ్వ ర్యంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న ఉచిత శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమానికి ఎంపీ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు, శ్రీలక్ష్మి పాఠశాల డైరెక్టర్ దీక్షిత్, ఇనాక కోర్సు డైరెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

'కళల ప్రదర్శనలకు ఆదరణ కల్పిస్తాం'

కర్నూలు కల్చరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): నాటక, శాస్త్రీయ కళల ప్రదర్శనలకు నిత్యం ఆదరణ కల్పిస్తామని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అన్నారు. శుక్రవారం రాత్రి నగరంలోని సూర్యకళ కల్చరల్ అకాడమీ సంస్థ గత నెల రోజులకు పైగా నిర్వహించిన వేసవి సంగీత, నృత్య శిక్షణలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చిన్నారుల ప్రదర్శనలు, ప్రశంసాపత్రాల ప్రదాన కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా పత్తి ఓబులయ్య విచ్చేసి, జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాలను ప్రారంభించారు. చిన్నారులు ప్రదర్శించిన మృదంగ కచేరీ, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. వీహెచ్‌పీ నేత మోక్షేశ్వ రుడు, ఏపీ ఎస్పీ డీఎస్పీ మహబూబ్ బాషా, సూర్యకళా కల్చరల్ అకాడమీ సంస్థ నిర్వాహకులు సోమశేఖర్, గీతాంజలి, సుధాకర్ పాల్గొన్నారు.

నీటి తొట్లను వినియోగించుకోవాలి: ఎంపీడీవో

సి.బెళగల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద పంచాయతీల్లో నిర్మించిన నీటి తొట్లను వినియోగించుకోవాలని ఎంపీడీవో రాణెమ్మ రైతులకు సూచించారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పశువుల దాహం తీర్చడానికి గ్రామ పంచా యతీలలో నీటి తొట్లను నిర్మిస్తుందన్నారు.

సమ్మర్ క్యాంపు ముగింపు వేడుకలు

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కల్లూరు శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపు శుక్రవారంతో ముగిసింది. గ్రంథాలయ అధికారి సంధ్యారాణి విద్యార్థులకు వ్యాస రచన, వివిధ క్రీడాంశాలలో పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

మట్కా బీటర్ల అరెస్టు

రూ.2.30లక్షల నగదు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ డీవై స్వామి

కోడుమూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఏడుగురు మట్కా బీటర్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ డీవై స్వామి తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్ శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణ సమీపంలో కోడుమూరుకు చెందిన వీరరాజ నాయుడు, లింగ బలిజ విజయ్ కుమార్, దివాకర్, లింగ బలిజ గీత, కాశి అలాగే కోడుమూరు మండలం కల్లపరి గ్రామానికి చెందిన నాగేష్, దేవనకొండ మండలం బేతపల్లి గ్రామానికి చెందిన రెడ్డిరాజు మాట్కా రాస్తున్నట్లు సమాచారం అందడంలో దాడులు చేసి బీటర్లను అరెస్టు చేసినట్లు ఆయన చెప్పారు. వీరి దగ్గర నుంచి రూ.2.30లక్షల నగదు, 7 మాట్కా చీటీలను స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శంకర్‌నాయక్, హెడ్‌కానిస్టేబుల్ మద్దేశ్వర్ పాల్గొన్నారు.

ప్రధాన కూడళ్లలో బ్యానర్లు, ఫ్లెక్సీల తొలగింపు

కర్నూలు న్యూసిటీ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రధాన కూడళ్లలో ఎలాంటి బ్యానర్లు, ఫ్లెక్సీలు ఉండరాదని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ఇటీవల జరిగిన శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ల సమావేశంలో ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు, సిబ్బంది నగరంలోని పలు కూడళ్లలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా, కార్మిక సంఘాల బ్యానర్లు, ఫ్లెక్సీలు తొలగించారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో అనుమతులు లేకుండా బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయరాదని పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు స్పష్టం చేశారు.



ఫ్లెక్సీలను తొలగిస్తున్న పట్టణ ప్రణాళికా విభాగం సిబ్బంది

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

మద్దికెర, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదర్శ పాఠశాలలో మిగిలిన సీట్లకు భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సవిత తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ పాఠశాలలో 6, 7, 8 తరగతులతో పాటు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లకు ఈ నెల 10వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మండలంలోని విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 24న పాఠశాలలో పరీక్షలు ఉంటాయని, 25న ఎంపికైన విద్యార్థుల జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. 26న ధృవపత్రాల పరిశీలన ఉంటుందన్నారు.ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఫారాలను స్థానిక పాఠశాలలో ఇవ్వాలన్నారు.

చిన్నారుల చదువులో అంగన్‌వాడీ కేంద్రాలు



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో లలిత

మద్దికెర, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారుల చదువులో కీలకమని ఐసీడీఎస్ సీడీపీవో లలిత అన్నారు. శుక్రవారం స్థానిక 8వ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలపై చిన్నారుల తల్లులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించిందని అన్నారు. 3 నుంచి 5 ఏళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌభాగ్యలక్ష్మి, అంగన్‌వాడీలు ఉన్నారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు



చౌక దుకాణాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ హుశేన్ సాహెబ్

మద్దికెర, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌకదుకాణాల డీలర్లు అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ హుశేన్ సాహెబ్ అన్నారు. శుక్రవారం మండలంలోని మద్దికెర, ఎం. అగ్రహారం గ్రామాల్లో చౌకదుకాణాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రేషన్ పంపిణీ వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రామాదాసు, వీఆర్వో రంగస్వామి తదితరులు ఉన్నారు.

దోమతెరలు వాడాలి

మద్దికెర, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రజలు రోగాల బారిన పడకుండా సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని దోమతెరలు వాడాలని ప్రభుత్వ వైద్యాధికారిణి శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో మలేరియా నివారణ మహోత్సవాల్లో భాగంగా మలేరియా అంతం మనతోనే అని ప్రతిజ్ఞ చేశారు. మలేరియా వారోత్సవాలు ఈ నెల 30వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ప్రజలు ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటిని నిల్వ చేసే డ్రములు, డబ్బాలపై మూత మూయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి అక్బర్‌బాషా, హెల్త్ సూపర్‌వైజర్లు కృష్ణమ్మ, సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

తుగ్గలి తహసీల్దార్‌గా రవి

తుగ్గలి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తుగ్గలి మండలం తహసీల్దార్‌గా పని చేస్తున్న రమాదేవి బదిలీపై వెళ్లడంతో తుగ్గలి తహసీల్దార్‌గా రవిని నియమించారు. శుక్రవారం ప్రభుత్వం విడుదల చేసిన బదిలీ జాబితాలో తుగ్గలి తహసీల్దార్‌గా పని చేస్తున్న రమాదేవిని మంత్రాలయం తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లగా.. అక్కడ పని చేస్తున్న తహసీల్దార్ రవిని తుగ్గలి తహసీల్దార్‌గా నియమించారు.

సాంకేతిక సాగుతో అధిక దిగుబడులు

● ఏడీఏ వేదమణి



రైతులకు రాయితీ వేరుశనగ కాయలను అందజేస్తున్న వ్యవసాయ అధికారులు

ఆదోని అగ్రికల్చర్ , జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : సాంకేతిక సాగులో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని సహాయ వ్యవసాయ సంచాలకులు వేదమణి అన్నారు. శుక్రవారం మండలంలోని దొడ్డనకేరి గ్రామంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు సాగు పద్ధతులపై వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ఆరంభమైందని విత్తనాలకు తప్పకుండా విత్తన శుద్ధి చేశాకే విత్తనాలు నాటాలని సూచించారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలన్నారు. రాయితీ వేరుశనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వై మౌనిక మిరప, ఉల్లి, పత్తి పంటల్లో యాజమాన్య పద్ధతులు వాటికి సోకే తెగుళ్ల పురుగుల నివారణపై రైతులకు వివరించారు. అనంతరం రాయితీ సబ్సిడీ వేరుశనగ కాయలను అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో గీత, ఆత్మ సిబ్బంది రామాంజినేయులు. సంజీవ్, లోకేష్, భారతి పాల్గొన్నారు.

వెంకటపతికి నాయీబ్రాహ్మణ సంఘం సన్మానం



వెంకటపతిని సన్మానిస్తున్న నాయీబ్రాహ్మణసంఘం నాయకులు

పత్తికొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ట్రైబల్ కౌన్సిల్ అడ్వజరీ కమిటీ మెంబర్ వెంకటపతిని శుక్రవారం పత్తికొండ నాయిబ్రాహ్మణ సంఘం నాయకులు సన్మానించారు. పెద్దాంజనేయస్వామి దేవాలయంలో సంఘం నాయకులు గోవిందులు, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, చిన్నల ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సారా పట్టివేత : వ్యక్తి అరెస్ట్

పత్తికొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినటు సీఐ జయన్న తెలిపారు. శుక్రవారం పత్తికొండ చక్కరాళ్లక్రాస్‌వద్ద మద్రిమాన్‌తండాకు చెందిన దిద్దెనాయక్ 5లీటర్ల సారాను తరలిస్తుండగా అరెస్టు చేశామని, కోర్టుకు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.



ట్యాంకులో పాకర

శుభ్రతను పట్టించుకోరూ!

దేవనకొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ పాఠశాల వద్ద ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకు శుభ్రం చేయడంలేదు. దీంతో పాకర పేరుకుపోయింది. ట్యాంకు పైన ఎలాంటి కప్పులేకపోవడంతో కోతులు, పిట్టలు వాటిలో దిగుతున్నాయి. దీంతో నీరు కూడా కలుషితమవుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకును శుభ్రం చేయాలని అనేక సార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకునే వారే కరువయ్యారని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో వ్యాధులు ప్రబలకుండా అధికారులు ట్యాంకును శుభ్రంచేసి స్వచ్ఛమైన నీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు.



వృథా అవుతున్న నీరు

విద్యుత్ స్తంభం తొలగింపు

ఆలూరు, జూన్6(ఆంధ్రజ్యోతి): ఆలూరు-ఆదోని ప్రధాన రహదారిలో విద్యుత్ స్తంభాన్ని పంచాయతీ సిబ్బంది శుక్రవారం తొలగించారు. జాతీయ రహదారి మధ్యలో ఉన్న డివైడర్ మధ్యలో వంగిపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆలూరు ఎస్ఐ మహబూబ్‌బాషా పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకర్‌రావు విద్యుత్ స్తంభాన్ని తొలగించారు.



విద్యుత్ స్తంభాన్ని తరలిస్తున్న కార్మికులు

క్రీడలు మానసిక ఉల్లాసాన్నిస్తాయి: ఎమ్మెల్యే

మద్దికెర, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానంలో కేఈ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, పత్తికొండ సీఐ పులిశేఖర్ క్రికెట్ ఆడారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు జమేదార్ రాజన్న యాదవ్, తాలుకా తెలుగు యువత అధ్యక్షులు ఈడిగ చంద్రశేఖర్‌గౌడు, పంచాయతీ సభ్యులు ఎన్.లక్ష్మీనారాయణ, జంబునాథ్ రాయుడు, టీడీపీ నాయకులు ఆకుల వేణుగోపాల్, పారా విఠోబ, కిష్టన్న, భీమరాజు, సుధాకర్ చౌదరి తదితరులు ఉన్నారు.



క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

ఇది రైతుల ప్రభుత్వం

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ రైతుల ప్రభుత్వం అని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని పెరవలి గ్రామంలో రైతు సేవా కేంద్రంలో రాయితీ వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఖరీఫ్ ప్రారంభం కాకముందే రైతులకు 40 శాతం రాయితీతో విత్తనాలు సరఫరా చేయడం జరిగిందన్నారు. మండలంలోని ప్రతి రైతు సేవా కేంద్రంలో విత్తనాల పంపిణీ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మండల అధికారి ఉప్పర రవి, రైతు సేవా కేంద్రం సిబ్బంది బోజరాజు, ఇంద్రజ ఉన్నారు.

విప్లవ వీరుడు చంద్ర రాజేశ్వరరావు

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రామచంద్రయ్య



చంద్ర రాజేశ్వరరావుకు నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

పత్తికొండ టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): విప్లవ వీరుడు, ఆదర్శ కమ్యూనిస్టు నేత చంద్ర రాజేశ్వరరావు అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రామచంద్రయ్య అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలోని సీఆర్ భవన్‌లో సీపీఐ దివంగత, భూపోరాటయోధులు చంద్ర రాజేశ్వరరావు 112వ జయంతి వేడుకలు పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామచంద్రయ్య మాట్లాడుతూ కృష్ణా జిల్లాలో జన్మించిన చంద్ర రాజేశ్వరరావు పార్టీ అగ్ర నాయకుల్లో ఒకరుగా ఎదిగారని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహేబ్, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, ప్రజా సంఘాల నాయకులు కారన్న, కారుమంచి, ఉమామహేశ్వరరావు, నాగిరెడ్డి పాల్గొన్నారు.

రిలీవింగ్ ఆర్డర్‌పై ఉపాధ్యాయుల మల్ల గుల్లాలు



నెహ్రూ మెమోరియల్ పాఠశాలలో రిలీవ్ ఆర్డర్ కోసం వచ్చిన బదిలీ అయిన ఉపాధ్యాయులు

ఆదోని అగ్రికల్చర్ , జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఏళ్ల తర్వాత బదిలీలను ప్రభుత్వం చేపట్టింది. ఉపాధ్యాయులు కోరుకున్న చోటికి బదిలీలు అయినా రిలీవింగ్ ఆర్డర్ కోసం ఉపాధ్యాయులు మల్ల గుల్లాలు పడుతున్నారు. శుక్రవారం ఉదయం స్కూల్ అసిస్టెంట్లకు బదిలీ ఆర్డర్లు వచ్చినప్పటికీ రిలీవింగ్ చేసేందుకు హెచ్‌ఎంలు ససేమిరా అంటున్నారు. 50శాతం సబ్జెక్టు టీచర్లు ఉంటేనే రిలీవింగ్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో వారి ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నారు. కోరుకున్న చోటికి బదిలీపై వెళ్లిన వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు.

విధులకు గైర్హాజరైన సచివాలయ ఉద్యోగులు

- మెమోలు జారీచేసిన డిప్యూటీ ఎంపీడీవో

ఆలూరు, జూన్6(ఆంధ్రజ్యోతి): ఆలూరు సచివాలయం-3లో విధులు నిర్వహిస్తున్న ఐదుగురు ఉద్యోగులకు డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకర్‌రావు మెమోలు జారీ చేశారు. శుక్రవారం ఉదయం 11;30 గంటలు దాటినా విధులకు గైర్హాజరు అయినట్లు తనిఖీలో బయటపడడంతో పంచాయతీ కార్యదర్శి శేఖర్, అగ్రికల్చర్ అసిస్టెంట్ శివప్రసాద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అశోక్‌కుమార్, గ్రేడ్-3 ఏఎన్‌ఎం యశోద, గ్రేడ్-2 వీఆర్వో అక్కమ్మలకు ఎక్స్‌ప్రెస్ మెమోలు జారీ చేశామన్నారు. పలుమార్లు హెచ్చరించినా మార్పు లేదని, అందుకే వారిపై సర్వీస్ రూల్స్ ప్రకారం చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. 24 గంటల్లోపు వివరణ ఇవ్వాలని మెమోలో పేర్కొన్నారు.

వైభవంగా గాయత్రీదేవి జయంతి ఉత్సవాలు

ఆస్పరి, జూన్6(ఆంధ్రజ్యోతి): ఆస్పరికి సమీపంలో రామతీర్థం కొండపై గాయత్రిసేవా ఆశ్రమంలో కొలువైన వేదమాత గాయత్రీ ఆలయంలో గాయత్రీదేవి జయంతి ఉత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. అనంతరం వినాయకుడు సుబ్రహ్మణ్యంస్వామికి, అమ్మవారికి ఉదయం పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణలు చేశారు. గాయత్రీ హోమాన్ని వేద పండితుల ఆధ్వర్యంలో భక్తులచే చేయించారు. అమ్మవారికి భక్తులు ఒడి బియ్యాన్ని సమర్పించారు. ఆదోని, పత్తికొండ, ఆస్పరి తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. రాతి గాయత్రీ అమ్మవారి భజనబృందంచే భజన కార్యక్రమాలు చేశారు.



పూజలందుకుంటున్న అమ్మవారు

ప్రమోద్‌కుమార్‌రెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే



ప్రమోద్‌కుమార్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కేఈ

పత్తికొండ, జూన్6(ఆంధ్రజ్యోతి): పత్తికొండ మార్కెట్‌యార్డ్ మాజీచైర్మన్, టీడీపీ నాయకులు అట్ల ప్రమోద్ కుమార్‌రెడ్డి కుటుంబాన్ని శుక్రవారం ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు పరామర్శించారు. ప్రమోద్ కుమార్‌రెడ్డి సోదరుడు దంతవైద్యుడు వినోద్‌కుమార్‌రెడ్డి అనారోగ్యంతో కొద్దిరోజులక్రితం మృతి చెందాడు. ప్రమోద్‌రెడ్డితోపాటు తల్లి ఆదిలక్ష్మితో పాటు పిల్లలు సుహాస్‌హరిరెడ్డి, సుదీపరెడ్డిలకు ఎమ్మెల్యే ధైర్యంచెప్పారు. ఆయనతోపాటు టీడీపీ నాయకులు వెంకటపతి. చౌదరి, విజయమోహన్‌రెడ్డి, కడవలసుధాకర్, తిప్పన్న టీడీపీ నాయకులు పలువురు ఉన్నారు.

ముగిసిన దేవాలయ భూముల వేలం

పత్తికొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ మండలంలోని పులికొండ రంగనాథస్వామి దేవాలయ భూముల కౌలువేలం పాట శుక్రవారం ముగిసింది. ఈవో వీరయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈవేలంపాటలో 40ఎకరాల దేవాలయ భూమిని రూ.3.52లక్షలు ఏడాది కౌలుగా నలుగురు రైతులు దక్కించుకున్నారు.

ప్రైవేటు విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలి

పత్తికొండ టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తూ ప్రచారాలు జరుపుతున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల గుర్తింపు ను రద్దు చేయాలని ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజు, స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివప్రసాద్ గైడు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంఈవో రమేష్‌కు విద్యార్థి సంఘాల నాయకులు వినతి పత్రం ఇచ్చారు.

స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలి

ఆలూరు, జూన్6(ఆంధ్రజ్యోతి): యువత స్వయం ఉపాధివైపు అడుగులు వేసి ఉపాధి పొందాలని ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక బళ్లారి రోడ్డులో తాటిబెల్లం టీ కేంద్రాన్ని ఆయన పారంభించారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి అవకాశాలను ఎంచుకోవాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్, టీడీపీ నాయకులు బెంగళూరు కిషోర్ పాల్గొన్నారు.

నూతన పద్ధతులను వినియోగించుకోవాలి



ఎస్టీ రైతులకు సబ్సిడీపై కొర్ర, సజ్జ విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పత్తికొండ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయంలో నూతన సాంకేతిక పరిజ్ఞాన పద్ధతులు వినియోగించుకోవాలని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కే రాఘవేంద్ర అన్నారు. వికసిత్ కృషి సంకల్ప్ అభయాన్ కార్యక్రమంలో బాగంగా శుక్రవారం పత్తికొండ ఉద్యానవనశాఖ గోదాము ఆవరణలో రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, మట్టి నమూనా, పిచికారి మందులపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. చిరుధాన్యాల సాగుద్వారా నేటిరోజుల్లో లాభాలు ఎలా సాధించవచ్చో వివరించారు. ఎరువులు, పిచికారి మందులు మోతాదుకు మించి వినియోగిస్తూ రైతులు ఇటు పెట్టుబడులను పెంచుకుంటూ మరోవైపు భూమిని కాలుష్యంగా మారుస్తున్నారన్నారు. శాస్త్రవేత్తలు, నిపుణుల సలహాలు తీసుకుని నూతన సాంకేతిక పరిజ్ఞాన పద్ధతులు ఉపయోగించుకోవడం ద్వారా పెట్టుబడులు తగ్గించుకోవచ్చన్నారు. అనంతరం బారత్‌మిల్లెట్ పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త డా సంగప్ప తమ సంస్థ ద్వారా ఎంపికచేసిన గిరిజన (ఎస్టీ) రైతులకు 100శాతం సబ్సిడీపై సజ్జ, కొర్ర విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు చందన, తేజకుమార్, డా.రఫి, ఇఫ్కోప్రతినిధి మహేష్, సేవాలాల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ ఎస్ క్రిష్ణానాయక్, వైస్ చైర్మన్ బి.చిన్నస్వామినాయక్, సీఈవో ఎన్ రమణానాయక్, సంఘం రైతులు పాల్గొన్నారు.

టీడీపీతోనే యువతకు న్యాయం



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

తుగ్గలి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పార్టీతోనే యువతకు న్యాయం జరుగుతుందని టీడీపీ తెలుగు యువత మండల అధ్యక్షుడు సత్యప్రకాష్, బలరాముడు, మల్లి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గిరిగిట్లలో వారు మాట్లాడుతూ వైసీపీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎలాంటి ఉద్యోగాలు ఇవ్వకుండా అన్యాయం చేసిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కార్పొరేషన్ రుణాలు అందించడంతో పాటు మెగా డీఎస్సీతో టీచర్ పోస్టులు భర్తీ చేస్తున్నారన్నారు. పత్తికొండ ప్రాంతంలో టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటుచేస్తే వందల మందికి ఉద్యోగ అవకాశాలు లభించడంతో పాటు రైతులు పండించిన పంటలకు గ్రామంలోనే గిట్టుబాటు ధరలు అందుతాయన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు రంగస్వామి, రవికుమార్ ఉన్నారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి

తుగ్గలి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు బక్రీద్‌ను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని తుగ్గలి, జొన్నగిరి ఎస్ఐలు కృష్ణమూర్తి, మల్లికార్జున పేర్కొన్నారు. శుక్రవారం తుగ్గలి, జొన్నగిరి పోలీస్ స్టేషన్ల పరిధిలో ముస్లిం పెద్దలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బక్రిద్ వేడుకల్లో ఎలాంటి అల్లర్లు పాల్పడకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.

షైనింగ్ స్టార్ అవార్డుకు విద్యార్థుల ఎంపిక

దేవనకొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో ముగ్గురు విద్యార్థులు షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైనట్లు ఎంఈవో తిమ్మారెడ్డి తెలిపారు. దేవనకొండ జెడ్పీ పాఠశాల విద్యార్థి ప్రేమ్‌కుమార్, ఎఫ్ఆర్ పాఠశాల శ్రావణి, కప్పట్రాళ్ల శ్రావణి ఎంపిక కావడం జరిగిందన్నారు. ప్రతి విద్యార్థికి మెడల్, సర్టిఫికెట్‌తో పాటు రూ.20 వేల ఇవ్వనున్నట్లు తెలిపారు.

గ్రామసేవకుడి మృతి

దేవనకొండ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): దేవనకొండలోని గ్రామసేవకుడు బోయ కౌలుట్ల (55) శుక్రవారం మృతిచెందాడు. రెండు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మృతుడి భార్య గతంలో మృతి చెందగా, కుమారుడు ఉన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్

ఆలూరు, జూన్6(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వచ్చిన వినతులను పరిశీలించి పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు పంపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్పంచ్ మోహన్‌రాజ్, టీడీపీ నాయకులు నరసప్ప, మల్లికార్జునరెడ్డి, గూళ్యం రామాంజినేయులు, రాముయాదవ్, గుండయ్య, వన్నూరువలి, కిట్టు, కేశన్న, హనుమప్ప, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

బదిలీలు సహజమే

తుగ్గలి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వోద్యోగులకు బదిలీలు సహజమే అని తహసీల్దార్ రమాదేవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన తుగ్గలి తహసీల్దార్ కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న తహసీల్దార్ రమాదేవిని రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో డీటీ నాగరాజు, ఆర్ఐ వెంకట్రాముడు, సర్వేయర్ సుధాకర్, వీఆర్వోలు నాగేంద్ర, కాశీ రంగస్వామి, కృష్ణారెడ్డి, నవీన్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

స్టేడియం నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి



నిలిచిపోయిన ఇండోర్ స్టేడియం పనులను పరిశీలిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆదోని అగ్రికల్చర్ , జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కొత్త బస్టాండ్ వెనుక విట్టా కిష్టప్పనగర్‌లో ఆగిన ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు పట్టణ అధ్యక్షుడు శశిధర్ డిమాండ్ చేశారు. శుక్రవారం నిలిచిపోయిన ఇండోర్ స్టేడియం నిర్మాణం పనులను పరిశీలించారు. 2018 ఏడాదిలో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ. 2 కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణాన్ని చేపట్టిందన్నారు. 50శాతం పనులు పూర్తయిన ప్రభుత్వ మారడంతో ఐదేళ్ల నుంచి మొండి గోడలకే పరిమితమయ్యాయి. సదరు కాంట్రాక్టర్ బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిపేశారన్నారు. ఎంతోమంది జాతీయ రాష్ట్ర స్థాయి క్రీడాకారులు ఉన్నారని చేరడం లేక అవస్థలు పడుతున్నారని ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇండోర్ స్టేడియం నిర్మాణాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శివ, వెంకటేష్, ఉచ్చిరప్ప, ఉత్తేజ్, వినయ్, శివరాజు, వీరేష్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు



బాలికలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

వెల్దుర్తి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఎవరైనా బాల్యవివాహాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ సీడీపీవో లూక్ హెచ్చరించారు. మండలంలో సిద్దనగట్టు గ్రామంలో శుక్రవారం కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. లూక్ మాట్లాడుతూ కౌమారదశలో రక్తహీనత రాకుండా ఎలాంటి ఆహారం తీసుకోవాలి, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, పోక్సో చట్టం, బాలల హక్కులు, లింగవివక్ష, సైబర్ నేరాలు ఆన్‌లైన్ భద్రత, కౌమార బాలికల సాధికారత, శారీరక వ్యాయామం, ఆటల ప్రాముఖ్యత గురించి బాలికలకు అవగాహన కల్పించారు. అన్ని రంగాలలో బాలికలు ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేగేటుతో ఉరుకుంద భక్తుల ఇక్కట్లు

● కోసిగి-ఉరుకుందకు వెళ్లే సింగిల్ లైన్ రోడ్డులో భారీగా ట్రాఫిక్ జాం ● ప్రతి నెల అమావాస్యకు భక్తులకు తప్పని ప్రయాణ కష్టాలు



కోసిగిలో రైల్వేగేటు పడటంతో వేచి ఉన్న ఉరుకుందకు వెళ్లే భక్తులు



కోసిగి-జుమాలదిన్నె గ్రామాల మధ్యలో జరుగుతున్న కల్వర్టు పనులు

కోసిగి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కొలిచేవారికి కొంగు బంగారంగా విరాజిల్లుతూ మన రాష్ట్రంతో పాటు కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్రాల నుంచి ఉరుకుంద ఈరన్న స్వామిని దర్శించుకుని పూజలు చేసి మొక్కులు తీర్చుకునేందుకు నిత్యం వేలాది సంఖ్యలో భక్తులు వెళ్తుంటారు. కౌతాళం మండలం ఉరుకుంద గ్రామంలో కొలువుదీరిన ఉరుకుంద ఈరన్నస్వామి దర్శనార్థం జిల్లా కేంద్రం కర్నూలు, తెలంగాణ, కర్నాటక ప్రాంతాల నుంచి ప్రతి నెలా అమా వాస్యకు వందల సంఖ్యలో వేల సంఖ్యలో భక్తులు కోసిగి మీదుగా ఉరుకుంద క్షేత్రానికి తరలివెళ్తుంటారు. ప్రతి ఏటా భక్తులు అధికం కావడంతో స్వామివారి క్షేత్రానికి వెళ్లే సింగిల్ రోడ్డు లైన్ వల్ల బస్సులు, ఇతర వాహనాల భక్తులు ఇ బ్బందులు పడుతుంటారు. ముఖ్యంగా కోసిగిలో ఉరుకుంద వెళ్లే రోడ్డులో రైల్వే గేటు ఉండటంతో ప్రతి 20 నిమిషాలకు ఒకసారి రైల్వేగేటు పడటం, నిత్యం కోసిగి మీదుగా ప్రతి రోజు వందకు పైగా ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్, గూడ్స్ రైళ్ల రాకపోకలు సాగిస్తుండటంతో ఉరుకుందకు వెళ్లే భక్తుల వాహనాలు ట్రాఫిక్‌లో ఇరుకుని ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే గేటు నుంచి మార్కండేయ స్వామి దేవాలయం వరకు ప్రధాన రోడ్లపైనే వాహనాలు నిలిచిపోతున్నాయి. అలాగే కోసిగి నుంచి జుమాలదిన్నె, ఉరుకుందకు వెళ్లే సింగిల్ లైన్ రోడ్డు వల్ల వాహ నాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా కోసిగి నుంచి ఉరుకుందకు డబుల్ లైన్‌రోడ్డు, కోసిగిలో రైల్వే ఫ్లైఓవర్ నిర్మించి ఉరుకుంద ఈరన్నస్వామి ప్రయాణ కష్టాలు తీర్చవయ్యా అంటూ స్వామివారిని వేడుకుం టూ ప్రయాణాలు సాగిస్తున్నారు. మంగళవారం అమావాస్యరోజున ఈ జు మాలదిన్నె సింగిల్ లైన్ రోడ్డులో సుమారు 3గంటల పాటు ట్రాఫిక్ జామ్ కావడంతో భక్తులు పొలాల గట్ల మీదుగా అడ్డదారిలో ఇబ్బందులు పడుతూ ఉరుకుంద ఈరన్న స్వామి క్షేత్రానికి పూజలు చేసి మొక్కులు తీర్చుకుని తిరిగి గమ్యస్థానాలకు చేరాలంటే ఒక సాహస ప్రయాణమే అని చెప్పవచ్చు. ఆగస్టు నుంచి నెల రోజుల పాటు ఉరుకుంద స్వామికి శ్రావణ మాస పూజలు, ఉత్స వాలు ఎంతో వైభవంగా జరుగుతాయి. ఈనెల రోజుల్లో వేలాది వాహనాలు లక్షలాది మంది భక్తులు కోసిగి మీదుగా వెళ్లి వస్తుంటారు. ఇప్పటికైనా ప్రభుత్వం కోసిగి నుంచి ఉరుకుందకు వెళ్లే డబుల్ లైన్ రోడ్డు వేయాలని భక్తులు కోరుతున్నారు.


ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



కోసిగి నుంచి ఉరుకుందకు డబుల్ లైన్ రోడ్డుతో పాటు కోసిగిలో రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణం పనులకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి భక్తుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తా. కూటమి ప్రభుత్వంలో ఉరుకుంద ఈరన్న స్వామి భక్తుల ప్రయాణ కష్టాలు తీరుస్తాం.

- రాఘవేంద్రరెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి

సింగిల్ లైన్ రోడ్డువల్లనే ట్రాఫిక్ కష్టాలు



కోసిగి నుంచి జుమాలదిన్నెకు సింగిల్ లైన్ రోడ్డుతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. అలాగే కోసిగిలో రైల్వేగేటు పడటం వల్ల ట్రాఫిక్ జామ్‌తో భక్తులు ఇబ్బందులు పడుతున్నారనీ, కోసిగిలో రైల్వే ఫ్లైఓవర్‌తో పాటు ఉరుకుందకు వెళ్లే డబుల్ లైన్ రోడ్డు వేస్తే ఇబ్బందులు తప్పుతాయి.

- హనుమంతరెడ్డి, ఎస్ఐ

ప్రతిఒక్కరూ టీబీ పరీక్ష చేసుకోవాలి



కనకవీడు 2వ సచివాలయం వద్ద పోస్టరును విడుదల చేస్తున్న సర్పంచ్, వైద్య సిబ్బంది

నందవరం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనకవీడు సచివాలయం 2లో డాక్టర్ శ్రీలేఖ ఆధ్వర్యంలో శుక్రవారం ముక్త కంత అభియాన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మద్యపానం, దూమపానం, షుగర్ వ్యాధి గ్రస్తులు, 60 ఏళ్ల పైబడిన వారికి టీబీ వ్యాధి పరీక్ష నిమిత్తం గళ్ల సేకరించారు. రోగులకు అవగాహన సదస్సు కల్పించారు. తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి తెలిపి ఎక్స్‌రేలు తీశారు. చికిత్స కోసం కొంత మందిని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉదయ్‌కుమార్, టీబీ సూపర్‌వైజర్ మల్లికార్జున, మల్లేశ్వరి సిబ్బంది పాల్గొన్నారు.

గోనెగండ్ల: టీబీ(క్షయ)వ్యాధి అంటువ్యాధి కావడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పుట్టపాశం గ్రామం నందు టీబీ క్యాంప్ ను డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి ప్రారంభించారు. అలాగే సచివాలయంలో 60 ఏళ్ల పైబడి బీపీ, షుగర్, ఆయాసం, దగ్గు లక్షణాలు ఉన్న వారికి గళ్ల పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా సత్యవతి, వైద్యులు కార్తీక్ మాట్లాడుతూ పుట్టపాశం గ్రామంలో అనుమానిత క్షయ వ్యాధి రోగులుగా గుర్తించామని తెలిపారు. ప్రభుత్వం టీబీ ముక్తభారత్ అబియాన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని100 రోజుల పాటు ప్రతి గ్రామంలోని సచివాలయంలో జరు గుతుందన్నారు. ఆ సచివాలయ పరిధిలోని చేసి వ్యాధి నిర్ధారణ అయితే ఆరోగికి ఆరు నెలలు ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. అలాగే పోషకాహారం కోసం ప్రభుత్వం నెలకు రూ. 1000 చెల్లిస్తుందన్నారు. టీబీ(క్షయ) వ్యాధి అంటువ్యాధి కావడంతో రోగుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ టీబీ సూపర్ వైజర్ వేణుగోపాలచారి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



క్యాంపును ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి

యోగా రిజిస్ట్రేషన్‌పై నిర్లక్ష్యం వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రవి

మంత్రాలయం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర రిజిస్ట్రేషన్‌లో నిర్లక్ష్యం వహించద్దని తహసీల్దార్ ఎస్.రవి అన్నారు. శుక్రవారం సాయంత్రం ఎంపీడీవో కార్యాలయం సమావేశ భవ నంలో ఎంపీడీవో నూర్జహాన్ ఆధ్వర్యంలో వీఆర్వోలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, గ్రామ కార్యద ర్శులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో విద్యావంతులు, అంగన్‌వాడీ, ఉపాధి కూలీలు, పొదుపు మహిళల సహకారం తీసుకుని యోగంధ్ర రిజిస్ట్రేషన్లు చేపట్టాలన్నారు. దీనిపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు. వీఆర్వోలు, గ్రామ కార్యదర్శులు అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ తలారీలు, ఉపాధి మేటీలతో కమిటీలు ఏర్పాటు చేసి విజయవంతానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో వీఆర్వోలు భీమన్నగౌడు, భీముడు, ఆనంద్, ప్రభాకర్, గ్రామ కార్యదర్శులు ఇజ్రత్ బాషా, స్వామినాథన్, వీరేష్, పాల్గొన్నారు.

కాచి వడబోసిన నీటినే తాగాలి



ఫిల్టర్ బెడ్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు నీటిని కాచి,వడబోసిన తరువాత తాగాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. పులికనుమ రిజర్వాయర్ నుంచి కొత్త నీరు వచ్చి చేరడం వల్ల గుడికల్ చెరువును పరిశీలించి, పట్టణ శివారులోని వాటర్ పంపుహౌస్ లోని ఫిల్టర్ బెడ్, క్లోరినేషన్ ప్రక్రియను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

నూతన విధానంతో మంచి దిగుబడులు



రైతులకు సూచనలు హార్టికల్చర్ శాస్త్రవేత్త మౌనిక

కోసిగి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సాగులో నూతన విధానం ద్వారా పంటల్లో మంచి దిగుబడులు సాధించొచ్చని బనవాసి హార్టికల్చర్ శాస్త్రవేత్త డా.మౌనిక అన్నారు. మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో కృషి విజ్ఞాన్ కేంద్రం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు సలహాలు, సూచనలు అందించారు. శుక్రవారం గ్రామంలో రైతులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందించే పథకాల ద్వారా ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటల గురించి ఉల్లి, మిరప, వేరుశనగ, పత్తి, పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కోసిగి రైతు సేవా కేంద్రం సిబ్బంది, వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

సమ్మెతో నీటి కష్టాలు

● మూడు రోజులుగా నీరు లేక ప్రజల ఇబ్బందులు
● స్పందించని అధికారులు



లక్ష్మీపేటలో వాటర్ ట్యాంక్ ద్వారా నీరు పట్టుకుంటున్న ప్రజలు



సంజీవ నగర్‌లో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు కాలనీల్లో మూడు రోజుల నుంచి నీరు రాక పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సమ్మె తీవ్ర తరం చేయడం తో పట్టణంలో నీటి కష్టాలు మొదలయ్యాయి. పలు కాలనీల్లో నీరు పసుపు రంగులో రావడం, దుర్వాసన వస్తుండడంతో ప్రజలు నీరు తాగడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. కలుషిత నీరు తాగడంతో డయేరియా, కలరా వంటి వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. ప్రజలకు తాగునీరు దొరకక చేతి పంపు నీరును ఆశ్రయిస్తున్నారు. పలు కాలనీల్లో నీరు రాకపోవడంతో మహిళలు ఖాళీ బిందేలతో నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి తాగునీటి అవసరాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

31వ రోజు కు చేరిన సమ్మె

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు వేతనాలు మరియు న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు నారాయణ డిమాండ్ చేశారు.రాష్ట్ర యూని యన్ పిలుపు మేరకు 31వ రోజు సమ్మెకొనసాగించారు.. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి సోమప్ప సర్కిల్ వరకు వెళ్లి న్యాయ మైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని నినాదాలు చెస్తూ వెళ్ళి మున్సిపల్ కార్యాలయం ఎదుట కూర్చోని తమ నిరసన తెలిపారు. నిరవధిక సమ్మెలో వెళ్ళుతున సిబ్బంది సేవలను ఆపేస్తున్న తరుణంలో తరువాత జరగబోయే పరిణామాలకు ప్రభుత్వమే భాధ్యత వహించా లన్నారు. ఎసేపు అనీఫ్, డానియల్, రాజేంద్ర, నరసప్ప పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలోనే టైలర్ల సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న అసోసియేషన్ కార్యదర్శి నజీర్‌హమ్మద్

గోనెగండ్ల, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోనే టైలర్ల సమస్యలు పరిష్కారం అవుతాయని జిల్లా టైలర్ల అసోసియేషన్ కార్యదర్శి నజీర్‌హమ్మద్, నరసింహులు అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ టైలర్ల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర టైలర్ల ఫెడరేషన్ ను కూటమి ప్రభుత్వం ఏర్పాటుచేసిందని రాష్ట్ర చైర్మన్‌గా ఆకాశపు స్వామిని నియమించినట్లు తెలిపారు. రాష్ట్ర టైలర్ల ఫెడరేషన్ ను ఏర్పాటు చేసి చైర్మన్ ను ప్రకటించడంపై వారు సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 9వ తేదిన గోనెగండ్లలో జిల్లా టైలర్స్ అసోసియేషన్ సభను జిల్లా అధ్యక్షుడు ఖలీల్‌బాషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నామని, విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోనెగండ్ల కాసీం, ఖాదర్‌బాషా, కాసీంపటేల్, అల్లాబకాష్ పాల్గొన్నారు.

బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలి



వినతి పత్రం ఇస్తున్న ఆర్‌పీవీఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు

మంత్రాలయం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయంలో బాలికల కోసం హాస్టల్ ఏర్పాటు చేయాలని ఆర్‌పీవీఎఫ్ జిల్లా కార్యదర్శి ఖాజా డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ ఎస్.రవిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. నియోజకవర్గ కేంద్రంలోనే బాలికల హాస్టల్ లేకపోవడంతో బాలికల విద్య వెనుకబడిందన్నారు. బాలికల అక్షరాస్యత పెరగాలంటే హాస్టల్ సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం బేటీ బచావో.. బేటీ పడావో ప్రకటనలకే పరిమితమైందని ఆరోపించారు. వెంటనే బాలికల విద్య కోసం హాస్టల్ సౌకర్యం కల్పించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఆర్‌పీవీఎఫ్ నాయకులు వెంకటేశ్, గౌతమ్, విజయ్ నాయక్, రవీంద్ర నాయక్‌లు పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్టు

రూ.2.30లక్షల నగదు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ డీవై స్వామి

కోడుమూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఏడుగురు మట్కా బీటర్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ డీవై స్వామి తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్ శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణ సమీపంలో కోడుమూరుకు చెందిన వీరరాజ నాయుడు, లింగ బలిజ విజయ్ కుమార్, దివాకర్, లింగ బలిజ గీత, కాశి అలాగే కోడుమూరు మండలం కల్లపరి గ్రామానికి చెందిన నాగేష్, దేవనకొండ మండలం బేతపల్లి గ్రామానికి చెందిన రెడ్డిరాజు మాట్కా రాస్తున్నట్లు సమాచారం అందడంలో దాడులు చేసి బీటర్లను అరెస్టు చేసినట్లు ఆయన చెప్పారు. వీరి దగ్గర నుంచి రూ.2.30లక్షల నగదు, 7 మాట్కా చీటీలను స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శంకర్‌నాయక్, హెడ్‌కానిస్టేబుల్ మద్దేశ్వర్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

గోనెగండ్ల, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని బి. అగ్రహారం గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు శనివారం ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి గ్రామంలో పర్యటిస్తున్నట్లు టీడీపీ నాయకులు రామనాయుడు, కరువ గోవిందు తెలిపారు. వారు మాట్లాడుతూ శనివారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే బీవీ గ్రామానికి చేరుకుంటారని తలిపారు. గ్రామప్రజలు సమస్యలు ఉంటే ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేయాలని వాటిపై చర్చించి పరిష్కరిస్తామన్నారు. ఈఅవకాశాన్ని అగ్రహారం గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ విజయభాస్కర్

గోనెగండ్ల, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఇటీవల పెరుగుతున్న సైబర్ నేరాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ విజయభాస్కర్ అన్నారు. గోనెగండ్లలో ప్రజలతో పోలీసు చట్టాలు, కోర్టు న్యాయం పట్ల అవగహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో కొందరు ఘర్షణలు సృష్టించేందుకు ప్రయత్నిస్తుంటారని వారి మాటలు నమ్మరాదన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు కు సంబంధించిన సమాచారాన్ని తమ దృష్టికి తీసుకురావాలన్ని గ్రామస్థులకు సూచించారు. సమాచారం ఇచ్చిన వారిపేర్లు అడ్రస్ గోప్యంగా ఉంచుతామన్నారు.

నేడు ఏకాదశి నిత్య పూజలకు విరామం

మంత్రాలయం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మఠంలో శనివారం ఏకాదశి సందర్భంగా బృందావనానికి నిత్యం జరిగే అభిషేకాలు, అలంకరణ, నిత్య అన్నదానం, రథోత్సవాలు ఊరేగింపు, పరిమళ ప్రసాదం బంద్ చేస్తారు. పీఠాధిపతులు సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో కేవలం బృందావనానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం నిర్వహించి మూల రాములకు పూజలు చేసి మహా మంగళ హారతులు ఇస్తారు. అలంకరణ లేని రాఘవేంద్రస్వామి నిజ బృందావనాన్ని భక్తులు దర్శించుకొనే అవకాశం మాత్రమే శ్రీమఠం అధికారులు కల్పించనున్నారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు, పండితులు, అర్చకులు, శ్రీమఠం ఉద్యోగులు ఉపవాసంను పాటిస్తారు.

శ్రీమఠం వేదపాఠశాలకు రూ.1.18 లక్షలు విరాళం

శ్రీ మఠానికి పొద్దుటూరుకు చెందిన దివిజహన్విక సింగనమల అనేభక్తురాలు రూ.1.18 లక్షలు విద్యానానికి విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్ తెలిపారు. శుక్రవారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని విరాళం ఇచ్చినట్లు తెలిపారు.

మంచాలమ్మ దేవత ఆలయ గడపమానుకు బంగారు పూత, వెండి తలుపులు



అమర్చిన వెండి తలుపులను పరిశీలిస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, జూన్ 6 (ఆంధ్ర జ్యోతి): రాఘవేంద్రస్వామికి ఆశ్రయం ఇచ్చిన గ్రామ దేవత మంచాలమ్మ ఆలయ గడపకు బంగారు పూత, వెండి తలుపులు అమర్చి అలంకరణ చేశారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు గర్భగుడి శిలామండపాన్ని బంగారు పూతతో అమర్చే పనులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా భక్తులు ఇచ్చిన వెండి, బంగారుతో మంచాలమ్మ గర్భగుడి ముఖద్వారానికి, గడపమానుకు కాపరుతో అలంకరించి దానిపై బంగారు పూత పూసేందుకు స్వర్ణకారులు పని చేస్తున్నారు. వెండితో ప్రత్యేకంగా తయారు చేయించిన తలుపులను శుక్రవారం మఠం పీఠాధిపతి పరిశీలించారు. దీంతో మంచాలమ్మ దేవాలయానికి విశేషకళ ఏర్పడింది. అమ్మవారికి బంగారు తలుపులు, వెండి గడప మాను ఏర్పాటుచేయడంపై భక్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. పీఠాధిపతి శ్రీమఠం అభివృద్ధికి కృషి చేస్తున్నారని భక్తులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ప్రహ్లాదరాయల ఊంజల సేవ



ప్రహ్లాదరాయలకు ఊంజల సేవ చేస్తున్న మఠం దివాన్ శ్రీనాథాచార్

రాఘవేంద్రస్వామి సన్నిధానంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలకు ఊంజల సేవ ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జ్యేష్ఠ మాసం దశమి శుభసందర్భాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో స్వామివారికి పాదపూజ చేసి పల్లకిలో ఊరేగించిన అనంతరం వివిద రథాలపై ఊరేగించారు. యాగశాలలో ప్రత్యేక మండపంలో స్వామివారిని ఊయలలో ఏర్పాటు చేసి ఊంజల సేవ రమణీయంగా నిర్వహించారు. కనులారా తిలకించిన భక్తులు మంత్రముగ్ధులయ్యారు.

వృద్ధులకు ఇంటి దగ్గరికే రేషన్

నందవరం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో డీలర్లు వృద్ధులకు ఇంటి దగ్గరికే రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నారు. శుక్రవారం నందవరంలో డీలర్ దానియేలు, శివ పంపిణీ చేశారు. వృద్ధులకు ప్రతి ఒక్కరి ఇంటికి తీసుకెళ్లి నిత్యవసర సరుకులు అందించాలని ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వరరెడ్డి, తహసీల్దారు శ్రీనివాసులు చేసిన ఆదేశాలతో అందరు ఇంటింటికి వెళ్లి రేషన్ అందజేస్తున్నట్లు డీలర్లు తెలిపారు.

10,11వ తేదీల్లో వర్షాలు

ఎమ్మిగనూరు రూరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో ఈనెల 10, 11వ తేదీల్లో జిల్లాలో పలు చోట్ల వర్షాలు పడే అవకాశం ఉందని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర తెలిపారు. ఈ ఏడాది చాలా మంది రైతులు ముందస్తుగ మే నెలలోనే పత్తిపంటలను సాగుచేశారని, ఇలా సాగుచేయడం వలన అనావృష్టితో ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు.